దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 60 శాతం భూములు ఖాళీగా ఉన్నాయి. అతికొద్ది ప్రాంతాల్లో అక్కడక్కడా కంది, సజ్జ పైర్లు సాగు చేసినప్పటికీ ఇంకా మొలకెత్తలేదు. సాగర్ ఆయకట్టు భూముల్లో కూడా ఎలాంటి పైర్లూ సాగుకు నోచుకోలేదు. ప్రతి సంవత్సరం కంది, సజ్జ, పెసర, శనగ సాగు చేసే వారు.

కొండపి ప్రాంతంలో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే వర్షం కురవకపోవడం ప్రతిబంధకంగా మారింది. గత నెలలో కురిసిన అరకొర వర్షానికి రబీలో పొగాకు సాగు చేసి ఖాళీగా ఉన్న భూముల్లో నువ్వు, జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకున్నారు. తిరిగి వర్షం పడకపోవడంతో ఎదురుచూస్తున్నారు. ఎర్రనేలల్లో ప్రస్తుతం వర్షం కురిస్తే కందితోపాటు అంతర పంటలుగా పశువుల మేత కోసం జొన్న, పిల్లిపెసర సాగు చేస్తారు. ఈనేలల్లోని రైతులు పొలాలకు పశువుల ఎరువును తోలుతున్నారు.


మార్కాపురం డివిజన్ పరిధిలో వరుణుడి కరుణలేక ఖరీఫ్ సాగు కదలడం లేదు. కంది, పత్తి పంటలు ఇప్పటికే సాగు కావాల్సి ఉంది. కానీ లోటు వర్షపాతంతో అవాంతరం ఏర్పడింది. మిర్చి, పొగాకు వేసేందుకు ఈ సంవత్సరం ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. గత నెలలో సాధారణ వర్షపాతం నమోదైనా ఖరీఫ్ సాగు ఊపందుకునేది. కానీ జల్లులు తప్ప జడివాన కరువైంది. ప్రస్తుతం మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల పరిధిలో 79,103 హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా 10,538 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి.


ఎదుగుదల లేని నువ్వుపైరు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా పడక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ ఆరంభంలో కురిసిన వానలతో రైతులు పొలాలను దున్ని సిద్ధం చేసుకున్నారు. కానీ తర్వాత సాధారణ వర్షపాతం కూడా కరువైంది. ఆగస్టు ప్రారంభమైనా సాధారణ విస్తీర్ణంలో 16.8 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. పైర్లు సాగు చేసుకునేందుకు రైతులు వరుణదేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమంది దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. మెట్ట ప్రాంతాల్లో సైతం ఎలాంటి పైర్లు సాగు చేయలేదు. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే నెలరోజులు గడిచిపోవడంతో అదును దాటిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- ఇప్పటికే సగం కాలం పూర్తి
- కరుణించని వరుణుడు
- ఆపై ఎండలు, గాలులు
- మెట్ట సాగుకు అదును దాటుతుందని రైతుల ఆందోళన

### ఎండుతున్న పైర్లు


త్రిపురాంతకం వద్ద ఎండిపోతున్న మిర్చి మొక్కలు

మరో ప్రధానమైన పత్తి పంట చూస్తే 31,582 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా.. ఈ సమయానికి 15వేల నుంచి 20వేల హెక్టార్లలో విత్తనాలు వేస్తారు. అలాంటిది 6,321 హెక్టార్లలో మాత్రమే వేయగలిగారు. దాదాపు 24వేల హెక్టార్లలో మిర్చి సాగు చేయాల్సి ఉండగా కేవలం 350 హెక్టార్లలోపు మాత్రమే సాగైంది. తొలకరి పైర్లు 12వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా అందులో సగం విస్తీర్ణంలో మాత్రమే వేశారు. అవి కూడా వర్షాభావం, ఎండల తీవ్రతతో ఎండిపోతున్నాయి. సాగుచేసిన ఇతర పైర్లను ప్రస్తుతం వాతావరణం దెబ్బతీస్తోంది. ఉపకరించే స్థాయి వర్షాలు కురవకపోగా సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఆపై వడగాలులు పైర్లను దెబ్బస్తున్నాయి. కొన్నిచోట్ల వాడుముఖం కూడా పట్టాయి. ఇప్పటికైనా వర్షాలు కురిస్తే ఆలస్యంగానైనా సాగుకు అవకాశం ఉందని, ఇదే వాతావరణ పరిస్థితి కొనసాగితే మాత్రం మెట్ట సాగుకు అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


త్రిపురాంతకం వద్ద ఎండుతున్న పెసరపైరు


# ఖరీఫ్‌కు ప్రతికూలం

## సాగు 16.80 శాతమే!

ఒంగోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి)/ మార్కాపురం/ కొండపి/దర్శి : జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు ప్రతికూలంగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా సాగు విస్తీర్ణం 20శాతం కూడా దాటలేదు. ఆశించిన రీతిలో జిల్లాపై వరుణుడు కరుణ చూపకపోవడంతో సాగు జాప్యమైంది. తాజాగా ఉష్ణోగ్రతలతోపాటు, వేడి గాలుల తీవ్రత పెరగడం రైతులను కలవరపెడుతోంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణంలో ఇప్పటి వరకూ కేవలం 16.80 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇదే వాతావరణ పరిస్థితి మరో వారం పది రోజులు కొనసాగితే మెట్టపైర్ల సాగుకు అదును దాటిపోతుంది.

### ఖరీఫ్ రెండు నెలలు పూర్తి

జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ కాలం. ఈ సీజన్‌లో 2.02 లక్షల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా కంది, పత్తి, మిర్చి, సజ్జ వంటి పంటలు ప్రధానంగా వేస్తారు. అందులో పూర్తిగా వర్షాధారంగా సాగు చేసే కంది, పత్తి పంటలే దాదాపు లక్షా 5వేల హెక్టార్లలో ఉంటాయి. ఆ రెండు పంటలలో అత్యధిక శాతం ఈ సమయానికే విత్తనాలు వేసి పైరు ఎదుగుదలలో ఉండాలి. ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో నెలరోజులు పైరుగా ఉండాలి. అయితే వర్షాలు సరిలేక అధికశాతం భూముల్లో విత్తనాలు పడలేదు. నిజానికి జిల్లాలో మే ఆఖరులో అడపాదడపా పడే జల్లులతోటే తొలకరి పైర్లుగా పిలుచుకునే నువ్వు, సజ్జ, పెసరలతోపాటు పశుగ్రాసం, పచ్చి రొట్టలను సాగుచేస్తారు. జూన్ రెండో పక్షం నుంచి ప్రధాన పంటలు వేస్తారు. అలాంటిది ఈఏడాది వరుణుడి కరుణ ఆశించినంత లభించలేదు. జూన్‌లో మంచివర్షాలే కురిసినా వాటితో దుక్కులు దున్ని విత్తేందుకు భూములను సిద్ధం చేసిన రైతులను జూలైలో నెలకొన్న వర్షాభావం దెబ్బతీసింది.


కొండపి ప్రాంతంలో వాడిపోతున్న జొన్నపైరు

### 34వేల హెక్టార్లలోనే విత్తనాలు

జూన్‌లో 57.9మి.మీ సాధారణ వర్షపాతానికి సుమారు 44.7శాతం అధికంతో ఇంచుమించు 83.8 మి.మీ కురిసింది. దీంతో కొన్నిచోట్ల రైతులు పైర్లు వేశారు. అత్యధిక ప్రాంతాల్లో తదుపరి సాగుకు భూములను సిద్ధం చేశారు. జూలైలో 87.9 మి.మీ సాధారణ వర్షపాతానికి 82.8 మి.మీ మాత్రమే కురిసింది. అది కూడా ఒకటి, రెండు విడతలుగా కాకుండా అప్పుడు కాస్త, అప్పుడు కాస్త పడటంతో సాగుకు పెద్దగా పనికిరాలేదు. దీంతో అధికశాతం భూముల్లో విత్తనాలు పడలేదు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.02లక్షల హెక్టార్లుకాగా ఈ సమయానికి కనీసం 70వేల నుంచి 75వేల హెక్టార్లలో పంటలు సాగు కావాలి. అయితే కేవలం 34వేల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు పడ్డాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో 16.80శాతంలోనే పైర్లు వేశారు. దాదాపు 73వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో ఖరీఫ్‌లో కంది సాగు చేస్తారు. ఈ సమయానికి 40 వేల నుంచి 45వేల హెక్టార్లలో వేస్తారు. అలాంటిది ప్రస్తుతం 9,800 హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది.

# విద్యార్థినిని తల్లిని చేసిన ముగ్గురు అరెస్టు

- ఒకరు ప్రేమ పేరుతో మోసం, మరో ఇద్దరు బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారం
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు (క్రైం), ఆగస్టు 3: ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థినిని మోసగించి తల్లిని చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బాలికను ప్రేమపేరుతో మోసం చేసి గర్భవతిని చేసిన పి.సైదుబాబు, ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడిన ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్.వెంకటరెడ్డిలను చీమకుర్తి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. సైదుబాబు బాలికను ప్రేమించానని మాయమాటలు చెప్పి బలవంతంగా లొంగదీసుకొని గర్భవతిని చేశాడు. అదేక్రమంలో డబ్బులు ఆశ చూపడంతోపాటు వారి ప్రేమ వ్యవహారాన్ని బహిర్గతం చేస్తానని బెదిరించి బాలికపై శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈమేరకు ముగ్గురిపై గత నెల 31న చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డి.నీలిమావంశీలత పాల్గొన్నారు.

### జువైనల్ కోర్టుకు నివేదిక

ఒంగోలు (విద్య), ఆగస్టు 3 : కొత్తపట్నం మండలం మోటుమాల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్ విద్యార్థిని మరుగుదొడ్డిలో ప్రసవించిన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అందుకు సంబంధించి ఇప్పటికే కేజీబీవీ ప్రత్యేక అధికారి వి.అరుణకుమారి, ఏఎన్ఎం జె.సత్యవతిలను కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ అయిన డీఈవో సుభద్ర ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈమేరకు సమగ్రశిక్ష రాష్ట్ర సంచాలకులకు డీఈవో సమగ్ర నివేదికను పంపారు. కేజీబీవీలో బాలిక ప్రసవంపై మీడియాలో వచ్చిన కథనాలపై జువైనల్ జస్టిస్ కోర్టు.. సమగ్ర శిక్ష అధికారులకు నోటీసులు జారీచేసింది. బాలికలపై అఘాయిత్యాలు, అన్యాయం జరిగినా ఈ కోర్టు స్పందించి సుమోటాగా కేసును స్వీకరిస్తుంది. నోటీసుల నేపథ్యంలో డీఈవో సుభద్ర వ్యక్తిగతంగా జువైనల్ కోర్టుకు హాజరై ఈ ఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను, దీనిపై తీసుకున్న చర్యలను వివరిస్తూ నివేదిక సమర్పించారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను శనివారం డీఈవో పరామర్శించారు.

# డెంగ్యూతో బాలుడి మృతి


భరద్వాజ్ (ఫైల్)

కంభం, ఆగస్టు 3 : డెంగ్యూ జ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం కంభంలో చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు.. పంచాయతీ పరిధిలోని అమ్మవారిశాల సమీపంలో నివాసం ఉండే ఆలంపల్లి సుబ్బరాజు కుమారుడు భరద్వాజ్ (14) నాలుగు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అయితే శుక్రవారం బాలుడికి ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలుడి తండ్రి సుబ్బరాజు నీరసంతో పడిపోయారు. దీంతో తిరిగి కంభం వచ్చి మరో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. తండ్రి కోలుకోగా, చికిత్సపొందుతూ శనివారం బాలుడు మృతిచెందాడు. భరద్వాజ్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కందులాపురంలోనూ ఓ వృద్ధుడికి డెంగ్యూ జ్వరం రావడంతో గుంటూరుకు తరలించినట్లు తెలిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల నీరు నిలిచి దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో డెంగ్యూ వ్యాప్తి చెందుతోంది.

# రెచ్చిపోయిన జులాయిలు

- కూతురి జోలికి వెళ్లొద్దన్న తండ్రిపై కత్తితో దాడి
- మార్కాపురంలో ఘటన
- పరారీలో నిందితులు


దాడిలో గాయపడిన సత్యనారాయణ

మార్కాపురం, ఆగస్టు 3 : మార్కాపురంలో జులాయిలు రెచ్చిపోయారు. తన కుమార్తె జోలికెళ్లొద్దని మందలించిన తండ్రిపై ఓ యువకుడు అతని సోదరుడితో కలిసి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, స్థానిక పాండురంగస్వామి దేవస్థానం సమీపంలో నివాసముండే నాలి సత్యనారాయణ నెహ్రూబజార్‌లో సిమ్‌కార్డుల వ్యాపారం చేస్తుంటారు. ఆయన కుమార్తెను ఆవుల దుర్గాసాయి అనే యువకుడు కొంతకాలంగా వెంటపడి వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సత్యనారాయణ పలుమార్లు మందలించారు. మూడురోజుల క్రితం తన ఇంటి పరిసరాల్లో తిరుగుతున్న దుర్గాసాయిని సత్యనారాయణ తీవ్రంగా హెచ్చరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న దుర్గాసాయి తన అన్న భవానీకి విషయం తెలియజేశాడు. కొండపిలో ఉంటున్న భవానీ ఈ నెల 1న మార్కాపురం వచ్చాడు. నెహ్రూబజార్‌లో సత్యనారాయణ దుకాణం వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. తన తమ్ముడి జోలికొస్తే ప్రాణాలు తీస్తానని హెచ్చరించాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్లేందుకు ఓ ప్రింటింగ్ ప్రెస్ వద్దవున్న బైక్‌ను తెచ్చుకునేందుకు సత్యనారాయణ వెళ్లారు. అక్కడే కాపుకాసిన ఆవుల దుర్గాసాయి, భవానీలు కత్తితో సత్యనారాయణ తలపై, వీపుపై దాడిచేసి పారిపోయారు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే సత్యనారాయణను స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పట్టణ ఏఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


పామూరు రోడ్డులోని అసైన్డ్ భూమిలో వైసీపీ సర్పంచ్ అక్రమంగా నిర్మించిన భారీ భవంతి

# ఏం చర్యల్లేవ్!

- అసైన్డ్ భూముల్లో వెంచర్లు.. ఆపై భవంతులు..!
- చోద్యంచూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- వైసీపీ నేతల అక్రమాలపై మౌనం
- నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయం

కనిగిరి, ఆగస్టు 3: ప్రభుత్వం మారినా కూడా వైసీపీ నేతలపై అధికారుల్లో మాత్రం విశ్వాసం ఇంకా కొనసాగుతుందని ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కనిగిరి ప్రాంతంలో కొనసాగుతున్న భూఅక్రమాలే నిదర్శనం. నిరుపేదలకు భూమిని కేటాయిస్తే.. వారు వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుని అభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే, వాటిలో వెంచర్లు వేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ద్వారా అసైన్డ్ భూములు కేటాయించిన వారి వారసులు వ్యవసాయం చేసుకోవాల్సింది పోయి వాటిని అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకొందరైతే ఏకంగా అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేసి నిబంధనలకు పాతరేశారు. ఇంత జరుగుతు న్నా రెవెన్యూ అధికార యంత్రాంగం వారి వద్ద ముడుపులు పుచ్చుకుని పట్టించుకోకుండా వదిలేసిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### నీరుగారుతున్న ప్రభుత్వ ఉద్దేశం

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 250 ఎకరాల్లో ప్రభుత్వ, అసైన్డ్, పశువుల బీడు, పోరంబోకు భూముల్లో అక్రమంగా వెంచర్లు వెలిశాయి. దారిద్ర్యరేఖకు దిగువను ఉన్న పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు ప్రస్తుతం అన్యాక్రాంతమయ్యాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో అవి కూడా వెంచర్లుగా మారిపోయాయి. కొంతమంది భూ యజమానులు ప్లాట్లుగా కొంత స్థలాన్ని విక్రయించి ఆ సొమ్ముతో మిగతాదానిలో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు.

### వ్యవసాయం వదిలేసి వెంచర్లు

కనిగిరి పట్టణ పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం ఎదురు వ్యవసాయ భూముల్లో వేసిన వెంచర్లలో ఉన్న ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించి 615/2 సెటిల్‌మెంట్ సర్వే నెంబరును చూపించి ఎడవల్లి గ్రామ వైసీపీ సర్పంచ్ కాసుల గురవయ్య భారీ భవంతిని నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే, పట్టణ సమీపంలోని కందుకూరు రోడ్డులోని పేరంగుడిపల్లి గ్రామ పరిధిలో ఉన్న 26 సర్వే నెంబరులోని ఇండ్ల వినయ్‌కుమార్ అనే వ్యక్తి తన పేర ఉన్న 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయించటమే కాకుండా భారీ భవంతిని నిర్మించారు. ప్రభుత్వం వ్యవసాయం చేసుకుని జీవించేందుకు కేటాయించిన భూమిలో అక్రమంగా వెంచర్ వేయటమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. వీటిపై 2015, 2020లో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేసినప్పటికీ వాటిని ఖాతరు చేయలేదు. పైగా వాటి నిర్మాణాలకు అనుమతులు మంజూరుచేయడం వెనుక అధికారులు తాయిలాలు పుచ్చుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా వేసిన వెంచర్లలోని భారీ భవంతులు ఏఏ సర్వే నెంబర్లలో నిర్మించారు, వాటికి అనుమతులు ఉన్నాయా? లేదా? అన్నది పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పేరంగుడిపల్లి వద్ద 26 సర్వే నెంబరులోని వెంచర్‌లో నిర్మించిన విశాలవంతమైన భవనం



# హాజరు నిబంధనలు పాటిస్తోంది 47శాతం మంది టీచర్లే!

- పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు అసంతృప్తి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ఒంగోలు (విద్య), ఆగస్టు 3 : ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరు విషయంలో పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శనివారం ఆర్‌జేడీ, డీఈవోలు, ఎంఈవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరు విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. పాఠశాలల్లో 47.3శాతం మంది టీచర్లు మాత్రమే ముఖ హాజరుతో సరైన సమయానికి లాగిన్, లాగౌట్ వేస్తున్నారని కుండబద్దలు కొట్టారు. ఇకపై డీఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రతి ఒక్కరూ లాగిన్, లాగౌట్ టైం 100 శాతం కచ్చితంగా సరైన సమయంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరైన సమయంలో హాజరు నమోదు విషయంలో అలసత్వం వహిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి



ఎమ్మెల్యే బీఎన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంతనూతలపాడు, ఆగస్టు 3: తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కొనగానివారిపాలెం, పి.గుడిపాడు, చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం గ్రామస్తులు కోరారు. శనివారం ఒంగోలులోని బీఎన్ నివాసంలో ఎమ్మెల్యేను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు లేకపోవడంతో విద్యార్థులు, ఇతర పనులకు, ప్రభుత్వఉద్యోగాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోగినేని రాజ, ఎన్.ఆంజనేయులు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థం ప్రాజెక్టుకు ఆగిన సాగర్‌జలాలు

● నేడు ఒంగోలుకు తాగునీరు విడుదల



ప్రాజెక్టులో ఉన్న నీరు

చీమకుర్తి, ఆగస్టు 3: రామతీర్థం జలాశయానికి గతవారం రోజులకు సరఫరా అవుతున్న నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం జలాశయంలో 82మీటర్ల మేర మాత్రమే జలాలు ఉన్నాయి. పూర్తిస్థాయి నీటి మట్టం 85.34మీటర్లు కాగా ఈసారి విడుదల చేసిన జలాలుతో జలాశయం పూర్తిస్థాయిలో నిండలేదు. ఆయకట్టు కింద తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం దిగువకు నీటిని ఆదివారం విడుదల చేయనున్నారు. తొలుత ఒంగోలు నగరంలో తాగునీటి చెరువులను నింపటానికి నీటిని విడుదల చేయనున్నారు. తదుపరి క్రమేణా జలాలను బట్టి మిగతా తాగునీటి చెరువులను నింపాలని అధికారులు భావిస్తున్నారు.

## బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు విస్తృతం

● డీజీఎం అజీజ్





మాట్లాడుతున్న అజీజ్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 3: జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అక్టోబరు చివరినాటికి పూర్తిస్థాయిలో విస్తృతం చేయనున్నట్లు డీజీఎం ఎస్కే.అజీజ్ తెలిపారు. శనివారం ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ కంపెనీ వారు టీసీఎస్ కంపెనీ భాగస్వామ్యంతో సేవలను వినియోగదారులకు మరింత వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 271 టవర్స్ ఉన్నాయని, జూలై 31 నాటికి మరో 27 టవర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అక్టోబరు చివరినాటికి జిల్లాలోని అన్నీ టవర్స్ ద్వారా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 7774 మంది బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు 4జీ మొబైల్ హ్యాండ్ సెట్ కలిగి ఉండగా, ఇంకా కొందరు 2జీ, 3జీ సిమ్‌కార్డులను మాత్రమే ఉపయోగిస్తున్నారని, వీరంతా 4జీ సేవలను పొందడానికి కచ్చితంగా సిమ్‌కార్డులను మార్చుకోవాలని సూచించారు. ఈ 4జీ సిమ్‌కార్డులను పొందడానికి సమీపంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, ఫ్రాంచైజీ షోరూంలో, నగరంలోని ప్రధాన సెంటర్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్లు



కలెక్టర్ అన్సారియాకు బొకే అందజేస్తున్న తహసీల్దార్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3 : కలెక్టర్ తమీమ్ అన్సారియాను పలువురు తహసీల్దార్లు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకేలు, మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్, చిరంజీవి, బ్రహ్మయ్య, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

### ఇరువురు తహసీల్దార్లు బదిలీ

జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు తహసీల్దార్లను బదిలీలు చేస్తూ కలెక్టర్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కేఎస్ఆర్.కృష్ణారావును అక్కడే డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించగా, కనిగిరి ఆర్డీవో ఆఫీసులో ఏవోగా పనిచేస్తున్న ఎస్.ఉషారాణిని ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ స్పెషల్ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

## శ్రీరామ్ ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ అక్రిడిటేషన్

ఒంగోలు నగరం, ఆగస్టు 3: ఒంగోలు నగరం గుంటూరురోడ్డులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు కేంద్రప్రభుత్వం ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్‌ను అందజేసింది. రోగులకు అందించే సేవల్లో భద్రత, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నందుకు భారత జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ఆధీనంలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వారిచే శ్రీరామ్ ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ అందించారు. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యానికి శనివారం సమాచారం అందిందని హాస్పటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆసుపత్రులకు ప్రమాణికంగా పరిగణించే ఎన్ఏబీహెచ్ సర్టిఫికెట్ ఒంగోలులోని శ్రీరామ్ ఆసుపత్రికి దక్కుటం పట్ల ఆసుపత్రి వైద్యులు వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారికి పలువురు అభినందనలు తెలిపారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3: ఒంగోలు నగరం విజయనగర్‌కాలనీలో శనివారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఆదిలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ హెచ్‌వీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.ఉమాదేవి, కె.పద్మకుమారి, జి.శ్రీలక్ష్మి, ఏఎన్ఎం సీహెచ్.శ్రీలక్ష్మి, ఆషా వర్కర్ ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తిని నియంత్రించాలి

● ఎంపీ మాగుంట సూచన



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న రైతు ప్రతినిధులు, ఎమ్మెల్యే విజయకుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3: రానున్న సీజన్‌లో పొగాకు రైతులు పంట ఉత్పత్తిని నియంత్రించుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. రెండేళ్ళుగా లభిస్తున్న మంచిధరలకు కారణాలు హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. అలా కాకుండా ఎక్కువ పంట ఉత్పత్తి చేస్తే పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఇబ్బందులు పడతారని, అలాంటి పరిస్థితి రాకుండా రైతు నాయకులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుత సీజన్‌లో అధిక పంట ఉత్పత్తికి అపరాధ రుసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన విషయం విదితమే. అందుకు కృషి చేసిన ఎంపీ మాగుంటను శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో రైతు ప్రతినిధులు కలిసి సత్కరించారు. అపరాధ రుసుం రద్దుకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ కూడా వారు సత్కరించారు. కాగా ప్రస్తుత మార్కెట్ తీరు లభిస్తున్న ధరలు, వచ్చే సీజన్ పంట సాగు తదితర అంశాలను రైతు ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పంట సాగులో అప్రమత్తంగా ఉండాలన్నారు. వీలైనంత మేర ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు ఉత్పత్తిపై స్వీయనియంత్రణ పాటించాలని సూచించారు. రైతు ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలను పొగాకు బోర్డు అలాగే కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారికి మాగుంట హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు వడ్డెళ్ళ ప్రసాద్, పోతుల ప్రసాదరావు, పోటు మురళీ, ఆళ్ల సుబ్బారావు, మండవ నాగేశ్వరరావు, రావి ఉమామహేశ్వరరావు, అబ్బూరి శేషగిరిరావు, గురువారెడ్డి, పెనుబోతు సునీల్, పలు వేలం కేంద్రాల రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కలెక్టర్ తమీమ్ అన్సారియా ● మద్దిరాలపాడులో పండ్లతోటలు, చదలవాడలో పశుక్షేత్రం పరిశీలన





పండ్లతోటలను, పశుక్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నాగులుప్పలపాడు ఆగస్టు 3: ప్రభుత్వం ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు, చదలవాడ గ్రామాలలో ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా మద్దిరాలపాడులో బిందు సేద్యం ద్వారా రైతులు కాటా శేషయ్య, బైరపు రమాదేవి సాగు చేస్తున్న జామ, సీతాఫలం తోటలను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ఉద్యానపంటలతో నికర ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం బిందుసేద్యానికి ప్రోత్సాహం అందజేస్తుందని చెప్పారు. ఉద్యానశాఖ పంటలను మరింతగా సాగు చేయడంతో పాటు ఆర్గానిక్ పంటలను కూడా ప్రోత్సహించాలన్నారు. బిద్యం సేద్యం ద్వారా రైతులకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.61,711 విలువైన ఉపకరణాలకు రూ.46,108 రాయితీ ఇచ్చి రూ.15,603కు అందజేసినట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు వివిధ రకాల పథకాలను, రాయితీలను అందజేస్తున్నట్లు ఆ శాఖ అధికారి గోపీచంద్ వివరించారు.

### పశుక్షేత్రం సందర్శన

చదలవాడలోని ఒంగోలు జాతి పశుఉత్పత్తి క్షేత్రాన్ని కలెక్టర్ అన్సారియా సందర్శించారు. క్షేత్రంలోని పశుసంపదను, బ్లాకులను గ్రాసాన్ని, పరిశీలించారు. ఒంగోలు జాతి పశువుల ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలను, వాటి సంరక్షణలను ఏడీఏ రవికుమార్ వివరించారు. పశుసంవర్ధకశాఖ జేడీఏ బేబీరాణి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి వెంకటరావు, హార్టికల్చర్ ఏవో ప్రత్యూష, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై టీడీపీ శ్రేణుల సంబరాలు

ఎస్సీసెల్ ఆధ్వర్యంలో కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం



చంద్రబాబు, మోదీ, పవన్‌కల్యాణ్, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలుగుదేశం పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎన్టీఆర్ భవనం వద్ద ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి రవిచంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వర్గీకరణ డిమాండ్ న్యాయమైనదేనని భావించి జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ రిపోర్టుకు అనుగుణంగా 1998లో షెడ్యూలు కులాలను ఏ బీ సీ డీలుగా వర్గీకరిస్తూ జీవో విడుదల చేశారన్నారు. కాగా మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై మంద కృష్ణమాదిగ గత ముప్పై సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేశారని, అయితే ఆయన న్యాయమైన కోరికపై టీడీపీ కూటమి అనుకూలంగా వర్గీకరణకు హామీ వచ్చిందన్నారు. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ జాతికి మరింత మేలు జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమికి ఎస్సీ సెల్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హగ్గయ్యారాజ్, చుండి శ్యామ్, బాబూరావు, కార్పొరేటర్ సంద్రపాటి వర్ష్‌వర్ష్, టి.రవిబాబు, గద్దే కృష్ణ, మాజీ కౌన్సిలర్ మాగులూరి ప్రేమ్‌కుమార్, మాగులూరి సుందర్‌సింగ్, 11వ డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్, ముప్పవరపు కెన్నిత్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ రద్దు చేయాలి

● ఎంపీ మాగుంటకు వినతి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3: జీవిత బీమా, ఆరోగ్య బీమాపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కోరారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో శనివారం ఆయా సంఘాల నాయకులు ఎంపీ మాగుంటను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రజలు తమ కుటుంబ రక్షణ కోసం, ఆర్థిక భద్రత కోసం జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలను తీసుకుంటున్నారని తెలిపారు. వాస్తవంగా ప్రభుత్వం వీటిని ప్రజలకు ఉచితంగా అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో ప్రజలే తమ భద్రత కోసం బీమా పాలసీలను కొనుగోలు చేస్తున్నారని, అందువల్ల బీమాలపై విధించిన జీఎస్టీని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మాగుంట వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ.సుబ్బారెడ్డి, నాయకులు కె.బాలచంద్రం, బి.వెంకట్రావు, ఎం.సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు, సీహెచ్.నరసింహారావు, బీవీ.రమణయ్య, బి.కేశవరావు, పి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, విద్యాధర్, పి.కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సీహెచ్.ప్రసాద్, శరత్‌చంద్ర, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నార్తులకు అండగా అన్నక్యాంటీన్లు

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మదన్



పేదలకు అన్నదానం చేస్తున్న మదన్, పలువురు నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 3: తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లు అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాయని టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి. శనివారం ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణాల్లో పేదలకు ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన సైకో పాలనలో పేదల నోటిదగ్గర అన్నం లాగేసిందని విమర్శించారు. తిరిగి ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టడంతో పేద ప్రజల ఆకలి కష్టాలు తీరాయన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచనతో దాతలు ముందుకు వస్తున్నారని, ప్రతిరోజు పేదలకు ఉచితంగా అన్నం వడిస్తున్నట్లు తెలిపారు. 7, 8 డివిజన్ కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, సంద్రపాటి వర్ష్‌వర్ష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోయి, ప్రజలు మెచ్చిన పాలన వచ్చిందన్నారు. నియోజకవర్గ టీడీపీ శ్రేణుల సహకారంతో ప్రతి రోజు నగరంలోని నాలుగు అన్నక్యాంటీన్లలో సుమారు 1500మందికి ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, షేక్ కపిల్‌బాషా, శశికాంత్‌భూషణ్, బోను దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు మహిళలు ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి

● వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర





సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వసుంధర

ఒంగోలు నగరం, ఆగస్టు 3: జిల్లాలోని ప్రతి పొదుపు మహిళా ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని, ప్రతి నెలా పదవ తేదీలోపు బ్యాంకులో పొదుపు సొమ్ము, లోన్ రికవరీ సొమ్మును తప్పనిసరిగా చెల్లించాలని వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలోని సమావేశం హాలులో జరిగిన జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి పొదుపు మహిళా సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేయాలన్నారు. సభ్యులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను స్వతంత్రంగా నిర్వహించుకునే స్థాయికి ఎదగాలని ఆమె కోరారు. గతంలో తీసుకున్న శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణ బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. కార్యవర్గ సభ్యులు అందరూ జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించే దిశగా తమ వంతు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో వైద్యశాఖ అధికారి సుబ్బలక్ష్మి మహిళలకు అవసరమైన ఆరోగ్య సూచనలు చేశారు. సమావేశంలో డీపీఎం కృపారావు, ఏపీఎంలు సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అవీ..ఇవీ..

### జిల్లాలో భూసేకరణను వేగవంతం చేయాలి

● కలెక్టర్‌ను కోరిన ఎంపీ మాగుంట



కలెక్టర్ అన్సారియాతో చర్చిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3 : జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా జాతీయ, రాష్ట్ర ప్రాజెక్టులకు భూసేకరణను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఎంపీ మాగుంట కలిసి పలు అంశాలపై చర్చించారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైనుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రైల్వే బ్రిడ్జిలకు సంబంధించి కూడా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మరో వైపు జాతీయ రహదారుల విస్తరణతో పాటు రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కాగా ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయ సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు.

### పేస్‌లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఆగస్టు 3: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మహిళా సాధికారికత విభాగం ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.జ్యోతి సుప్రియ మాట్లాడుతూ కళాశాల నుంచి ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించినా, ర్యాగింగ్ ఘటనలో పాలు పంచుకున్న శిక్షార్హులన్నారు. సదరు విద్యార్థులపై ర్యాగింగ్ కేసులు నమోదైతే ఆరునెలల నుంచి పదేళ్ళ వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థులను సోదరభావంతో ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, వీరాంజనేయులు, రాపా, షేక్ అమర్, ఎస్.స్పందన, సుబ్బారావు, వైష్ణవి పాల్గొన్నారు.

### తల్లిపాలు అమృతంతో సమానం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మద్దిపాడు, ఆగస్టు 3: తల్లి పాలు అమృతంతో సమానమని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాలను శనివారం నందిపాడు గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు వైద్యాధికారులు ఆనంద్‌మోహన్, జగదీష్ బాబు, వినీల చౌదరి, రిమ్స్ వైద్య కళాశాల ఎస్పీఎంవో డాక్టర్ డి.శ్రీదేవి తదితరులు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ముర్రుపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి వస్తుందని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ నుంచి రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ లలితమ్మ, రజతకుమారి, నాగరాజి, సీతమ్మ, సూపర్‌వైజర్ ఐ.పద్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 3: ఆటో మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై జరిగింది. ఒంగోలు నుంచి మేదరమెట్ల వెళుతున్న ఆటో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఒంగోలు నగరం లాయర్‌పేటకు చెందిన ఆర్.పురుషోత్తం, ఎల్.సుబ్రహ్మణ్యంలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

### కలెక్టర్‌ను కలిసిన రిజిస్ట్రార్

ఒంగోలు(విద్య), ఆగస్టు 3: ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాను శనివారం ఆంధ్రకేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టర్‌కు యూనివర్శిటీకి చెందిన పలు అంశాలను వివరించారు.

### ఎంపీ మాగుంటను కలిసిన వీసీ

ఒంగోలు(విద్య), ఆగస్టు 3 : ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు. యూనివర్శిటీ నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని తదితర అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్ళారు. త్వరలో యూనివర్శిటీని సందర్శించి అక్కడి స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మాగుంట హామీ ఇచ్చారు.

**వీసీకి అభినందలు :** ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తిని శనివారం యూనివర్శిటీ పాలక మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కె.అనిలాకుమారిలు కలిసి యూనివర్శిటీ అభివృద్ధిపై చర్చించారు.

### పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360

సంతనూతలపాడు, ఆగస్టు 3: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శనివారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360 పలికింది. చిలకపాడు క్లస్టర్ నుంచి 1341 పొగాకు బేళ్లు రాగా 1123 బేళ్లు అమ్ముడయ్యాయి. 218 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ303.33 వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### 13న మండల సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు, ఆగస్టు 3: సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 13న సర్వసభ్యసమావేశం జరుగుతుందని ఎంపీడీవో శ్రీహరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బి.విజయ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

### రేషన్ షాపుపై విజిలెన్స్ దాడులు



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 3 : రేషన్ షాపుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి బియ్యం నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఎఫ్ఐ వంశీ తెలిపిన వివరాల మేరకు వినోదరాయునిపాలెం గ్రామంలోని రేషన్‌షాపుపై శనివారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. బియ్యం నిల్వలలో 56 బస్తాలు వ్యత్యాసం ఉండటంతో డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐ వంశీ తెలిపారు.

### గుర్తు తెలియని మృతదేహం

ఒంగోలు(క్రైం), ఆగస్టు3 : ఒంగోలు నగరం మామిడిపాలెం చెరువు వద్ద కాలువలో గుర్తుతెలియని మృతదేహంను శనివారం పోలీసులు గుర్తించారు. సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రెండు రోజుల క్రితం కాలువలో పడి మృతి చెంది ఉండ వచ్చనని భావిస్తున్నారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. దీంతో మద్యం సేవించి కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. తాలుకా పోలీసులు మృతదేహన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉద్యోగోన్నతుల ఆర్డర్లను వెనక్కు తీసుకోవడం దారుణం



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: అంగన్‌వాడీ వర్కర్ల ఉద్యోగోన్నతుల ఆర్డర్లను వెనక్కు తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఒంగోలు ప్రాజెక్టు పరిధిలోని అర్హులైన ఐదుగురికి ఈ ఏడాది జూన్ 25న కలెక్టర్ ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వారు విధుల్లో కూడా చేరి పనిచేస్తున్నారని తెలిపారు. కానీ జూలై మొదటివారంలో ఇక్కడున్న అధికారులు కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని విమర్శించారు. ఆయా సమస్యలపై ఈనెల 5వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, కుమారి, మున్ని, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుండ్లకమ్మపై వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

- నీరు లేకుండా బీడు భూములను తలపించేలా రిజర్వాయర్ ప్రాంతం
- దశాబ్దకాలం తరువాత పలు గ్రామాల నుంచి నది గుండా రాకపోకలు
- 15 ఏళ్లలో ఎన్నడూ లేని దుస్థితి

అద్దంకి, ఆగస్టు 3 : వైసీపీ పాలకుల నిర్లక్ష్యం గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 2003లో గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగగా 2008లో ప్రారంభించారు. అప్పటి నుంచి గత 15 సంవత్సరాలుగా ఎన్నడూలేని విధంగా ప్రస్తుతం గుండ్లకమ్మ రిజర్వాయర్ దుస్థితి ఉంది. రెండేళ్ల కిందట గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్‌లు వరద నీటికి కొట్టుకుపోవడంతో అనంతరం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ ఉండకుండా సముద్రం పాలవుతోంది. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గతంలో ఎన్నడూ చూడని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్‌లో డ్యామ్ వద్ద నుంచి అద్దంకి పట్టణం సమీపం వరకు ఎప్పుడు ఎంతో కొంత నీరు నిల్వ ఉండేది. దీంతో గుండ్లకమ్మ అవతలి గ్రామాల నుంచి నదిలో గుండా రాకపోకలకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. అద్దంకి పట్టణం నుంచి తిమ్మాయపాలెం, వేలమూరిపాడు-కొటికలపూడి, తిమ్మారెడ్డిపాలెం-మణికేశ్వరం మధ్య గుండ్లకమ్మ నదిలో నీరు లేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నడిచి, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతం బీడు పొలాలను తలపించేలా దర్శనమిస్తుంది.

2018లో కరువు పరిస్థితులలో కూడా ఇలాంటి స్థితిలో గుండ్లకమ్మ రిజర్వాయర్ లేదని, ఇది వైసీపీ నేతల నిర్లక్ష్యానికి సాక్ష్యమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయకట్టు రైతులకు సాగు నీటి సరఫరా లేకపోగా గుండ్లకమ్మ రిజర్వాయర్ ఆధారంగా చేపల వేట సాగించే సుమారు 2వేల కుటుంబాలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ లో నీరు నిల్వ లేకపోవడంతో ఎన్నికల వరకు వైసీపీ నాయకులకు ఇసుక తరలింపు ద్వారా కాసుల పంట కురిపించిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఇసుక తవ్వకాల కోసమే రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గేట్ల మరమ్మతులు జరిగి రిజర్వాయర్‌లో నీటి నిల్వలకు అవకాశం కలుగుతుందని ప్రజలు, రైతులు, జాలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


మణికేశ్వరం వద్ద బీడు భూములను తలపించేలా ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాంతం


రాజధాని నిర్మాణానికి పింఛన్ సొమ్మును విరాళంగా చంద్రబాబుకు అందజేస్తున్న వెంకటరావు

## రాజధాని నిర్మాణానికి పింఛన్ సొమ్ము విరాళం

దర్శి, ఆగస్టు 3: దర్శి పట్టణానికి చెందిన రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల ఆర్గనైజింగ్ కార్యదర్శి దివ్యాంగుడు సందు వెంకటరావు తనకు వచ్చిన రూ.10వేల పింఛన్ సొమ్మును అమరావతి రాజధాని నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారు. అమరావతిలో శనివారం సీఎం చంద్రబాబును వెంకటరావు కలిసి రూ.10 వేల ను అందజేశారు. దివ్యాంగుల స్ఫూర్తిని సీఎం అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఓబయ్య, వై. ఏడుకొండలు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారులు ప్రశాంతి, శాంతి

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

● సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు, ఆగస్టు 3 : పరిశరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని సీనియర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం చెరుకూరు ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది నేతృత్వంలో పర్చూరు ఇందిరా కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.శాంతి ప్రారంభించారు. రోగులకు మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ఏకాంబరేశ్వరరావు, డాక్టర్ గౌతమ్ రోగులకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతమైన జీవితానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణి, న్యాయవాదులు పూరిమెట్ల జాన్, కరి ప్రవీణ్, కొమ్మాలపాటి రవి కుమార్ ఆరోగ్య సిబ్బంది రావి వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గౌస్, సర్పంచ్ మల్లా అంజమ్మ, సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

కొండపి, ఆగస్టు 3 : తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పెట్లూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో రవిబాబు తెలిపారు. అవి శిశువుకు ఇచ్చే తొలి టీకా వంటివన్నారు. తల్లిపాల వారోత్సవా ల్లో భాగంగా శనివారం దాసరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లిపాల వలన ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పెట్లూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ మామిళ్లపల్లి లక్ష్మీనరసింహం పాల్గొన్నారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు.


తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరిస్తున్న ఎంపీహెచ్ఈవో రవిబాబు

# పంద్రాగస్టుకు అన్న క్యాంటీన్

- ఐదేళ్ల తర్వాత తెరుచుకోనున్న వైనం
- రూ.10లక్షలతో మరమ్మతులు

అద్దంకి, ఆగస్టు 3 : పేద ప్రజల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి ప్రారంభం కానుంది. జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను మూసివేయించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల నుంచి మూతపడిన అన్న క్యాంటీన్ భవనాన్ని రూ.10 లక్షలతో మరమ్మతులు చేయించి సిద్ధం చేశారు. అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డు వెంబడి ఎన్ఎస్‌పీ కాలనీ వద్ద గత తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించి పేదలకు రూ.5కే అన్నం పెట్టేది. వైసీపీ రాగానే ఇక్కడి అన్న క్యాంటీన్‌ను మూసివేయించి జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా పునఃప్రారంభిస్తున్నారు. పంద్రాగస్టు నుంచి క్యాంటీన్‌లు అందుబాటులో రానున్నాయి. అద్దంకిలోని అన్న క్యాంటీన్‌ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించేందుకు మునిసిపల్ అధికారులు సిద్ధం చేశారు. భవనానికి మరమ్మతులు, పెయింటింగ్, ఫ్లోరింగ్‌తో పాటు మహిళా మార్ట్ ఏర్పాటు సమయంలో తొలగించిన కిచెన్ నిర్మాణం, ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్నం పెట్టే అన్న క్యాంటీన్ మళ్లీ తెరుచుకోవడంపై పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అద్దంకిలో సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్

## తురకపాలెం సచివాలయం వినియోగంలోకి వచ్చేనా!

- ఆరు నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభం
- నిర్మాణ బిల్లులు చెల్లిస్తేనే తాళాలు ఇస్తానంటున్న వైసీపీ నేత


నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం

తాళ్లూరు, ఆగస్టు 3: లక్షలాది రూపాయలతో అన్నిహంగులతో నిర్మించిన తురకపాలెం గ్రామసచివాలయాన్ని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు. సచివాలయం భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్, గ్రామ వైసీపీ కీలక నేత అధికారులకు తాళాలు ఇవ్వలేదు. దీంతో నూతన భవనం నిరుపయోగంగా ఉంది. భవన నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పంచాయతీరాజ్ అధికారులకు భవనం స్వాధీనం చేయాల్సి ఉంది. తనకు బిల్లులు చెల్లించే వరకు తాళాలు ఇచ్చేదిలేదన్నట్టుగా సదరు వైసీపీ నేత వ్యవహరిస్తున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తన అనుచరుని ఇంటిని అద్దెకు తీసుకుని సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఎన్నికయ్యేవరకు అధికారులు అద్దె చెల్లించ లేదు. సర్పంచ్ అద్దె చెల్లించలేదన్న సాకుతో అనేక సార్లు సచివాలయానికి తాళాలు వేసి సిబ్బంది విధుల్లోకి రాకుండా ఇంటి యజమాని అడ్డుకున్నారు. ఈవిషయాన్ని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం చేకూరలేదు. ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నూతన సచివాలయ భవనంలోని మార్చేందుకు టీడీపీ సర్పంచ్ యత్నించాడు. కొత్త భవనంలోకి వెళితే తమ అద్దె చెల్లించరన్న కారణం చూపుతూ ఇంటి యజమాని ఇటీవల సచివాలయానికి తాళం వేసి సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. ఇదిలాఉండగా నూతన భవనంలోకి వెళ్లేందుకు సర్పంచ్ ప్రయత్నిస్తుండగా, తన బిల్లులు చెల్లించే వరకు తాళాలు ఇవ్వనని వైసీపీ కీలక నేత ప్రకటించినట్టు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనంలోకి తురకపాలెం సచివాలయాన్ని మార్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మేదరమెట్ల , ఆగస్టు 3 : కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున రోగులు పోటెత్తారు. శనివారం దైవాలరావూరులో జరిగిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో రోగులను డాక్టర్ మురళీకృష్ణ పరీక్షలు చేశారు. స్వగ్రామంలో అప్పుడప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించే వారు. కొరిశపాడు, జె.పంగులూరు, అద్దంకి తదితర ప్రాంతాల నుంచి సుమారు 500 మందికి పైగానే రోగుల వచ్చారు. వారందరినీ డాక్టర్ మురళీకృష్ణ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను అందజేశారు. దైవాలరావూరుకు చెందిన వ్యాపారవేత్త దేసు శివ, రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్, మాజీ సర్పంచ్ చెన్నుపాటి హరిబాబు తదితరులు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఉదయం నుంచి తీరిక లేకుండా మురళీకృష్ణ రోగులను పరీక్షించారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రజలు ఎంతో వ్యవప్రయాసలు కోర్చి తిరుపతి మురళీకృష్ణ వద్దకు వెళ్లి వైద్య సేవలు పొందేవారు. ఆయన ఇక్కడకు రావడంతో వైద్య పరీక్షల కోసం ఆయన వద్దకు రోగులు క్యూ కట్టారు.


దైవాలరావూరులో రోగులను పరీక్షిస్తున్న శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ

## పంచాయతీ స్థలంలో వైసీపీ నేత అక్రమ నిర్మాణం తొలగింపు

సింగరాయకొండ, ఆగస్టు 3 : సింగరాయకొండ పంచాయతీ పరిధి బాలయోగినగర్ సర్వే నెం.668లో పంచాయతీకి చెందిన స్థలాన్ని ఆక్రమించి వైసీపీ వార్డు సభ్యుడు దావులూరి ఆదెయ్య నిర్మించిన మెట్లను శనివారం అధికారులు తొలిగించారు. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఆదెయ్య ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. దీనిపై గతంలో స్థానికులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం డీఎల్పీవో పద్మ పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. వారి ఆదేశాల మేరకు అప్పటి కార్యదర్శి పంచాయతీ స్థలంలో ఉన్న మెట్లను తొలగించాలని ఆదెయ్యకు నోటీసులు ఇచ్చారు. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు, ప్రతివాదనలు ఉన్న హైకోర్టు పంచాయతీ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలను ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు స్థలంలో వైసీపీ నేత నిర్మించిన మెట్లను తొలిగించారు. ఈకార్యక్రమంలో ఎస్సై టి.శ్రీరాం, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, ఆర్ఐ ప్రవీణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలిగిస్తున్న ఎక్స్‌కవేటర్

## అనుమతి మేరకే పొగాకును పండించాలి

వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

టంగుటూరు, ఆగస్టు 3 : రైతులు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకును పండించాలని వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు కోరారు. ప్రస్తుత మార్కెట్‌ను చూసి మోసపోవద్దన్నారు. శనివారం పొగాకు వేలం ముగిసిన తర్వాత సూపరింటెండెంట్ రైతులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పొగాకు ధరలను చూసి పొలాల కౌళ్లు, బ్యారన్‌ల లీజులు భారీగా పెంచి తీసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కొందరు రైతులు అనుమతి లేకుండానే పొగాకు బ్యారన్లు నిర్మిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాచేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు. ఇప్పటి ధరలు వచ్చే ఏడాది ఉంటాయన్న గ్యారెంటీ లేదని, కౌళ్లు, లీజులు పెంచుకొని అవస్థలు పడవద్దన్నారు.


రైతులతో మాట్లాడుతున్న వేలం కేంద్రం సూపరింటెండెంట్

## టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ వార్డు సభ్యురాలు

● మంత్రి స్వామి సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, ఆగస్టు 3 : సింగరాయకొండ గ్రామ పంచాయతీ లోని రెండో వార్డు సభ్యురాలు మంటి సువార్తమ్మ వైసీపీని వీడారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెతోపాటు మరో పది కుంటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి మంత్రి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ సందానిబాష, సుదర్శి ప్రసాద రావు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి స్వామి

## గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమదేవి

సింగరాయకొండ, ఆగస్టు 3 : గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమదేవి సూచించారు. శనివారం పంచాయతీ పరిధిలోని సుందర్‌నగర్ గిరిజన కాలనీలో కందుకూరు మండల న్యాయ సేవాధికార సంస్థ, స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పూర్ణిమదేవి మాట్లాడుతూ గిరిజనులకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్. నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు మంచి చదువులు చదివి ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నగేష్‌కుమారి, సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై టి.శ్రీరాం, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు, వైద్యులు చైతన్యకృష్ణ, న్యాయసేవా సహాయకులు పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమదేవి

## ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 3 : పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ఈనెల 8న పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో బి.నాగేంద్రవదన్ ఆదేశించారు. జరుగుమల్లిలో శనివారం ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఐదో తేదీన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ప్రకటించాలన్నారు. ఎన్నికల విషయం తల్లిదండ్రులకు తెలియజేసి, పోలింగ్ రోజున వారిని స్కూల్‌కు ఆహ్వానించాలన్నారు.

## రైలు ఇంజన్‌పై ప్రయాణించిన యువకుడు

● విచారించి విడిచిపెట్టిన రైల్వే అధికారులు

చీరాలటౌన్, ఆగస్టు 3 : మతిస్థిమితం సరిలేని యువకుడు రైలు ఇంజన్‌పైకి ఎక్కి ప్రయాణించాడు. ఈ ఘటన శనివారం చీరాలలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే ఉదయం చీరాలలో సింహపురి రైలు వచ్చి ప్లాట్‌ఫాంపై ఆగి కొద్దిసేపటికి బయలుదేరింది. అయితే వేదుళ్లపల్లి రైల్వే సిబ్బంది రైలు ఇంజన్‌పై యువకుడు ఉన్నట్లు గుర్తించి బాపట్ల రైల్వే సిబ్బదికి సమాచారం అందించారు. దీంతో అధికారులు బాపట్లలో రైలును ఆపి యువకుడిని కిందికి దింపి అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడికి మతిస్థిమితం సరిగాలేదని గ్రహించి జాగ్రత్తలు చెప్పి వదిలేశారు.


రైలు పైనుంచి యువకుడిని కిందికి దించుతున్న రైల్వే సిబ్బంది

## వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయండి

● సీఎంకు మన్నే రవీంద్ర విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న డాక్టర్ మన్నే రవీంద్ర

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 : నియోజకవర్గంలో తాగునీటి సమస్య ప్రధానంగా తీవ్రమైందని, పరిష్కారం కావాలంటే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును డాక్టరు మన్నె రవీంద్ర కలసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలు వివరించినట్లు తెలిపారు. మార్కాపురం జిల్లాను త్వరలో ప్రకటిస్తే పశ్చిమ ప్రాంత ప్రజలు ఇబ్బందులు తీరుతాయని తెలిపినట్లు తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ 'మీ నియోజకవర్గం ఎందుకు ఓడిపోయింది' అని అడగడంతో అందులకుగల కారణాలను రవీంద్ర వివరించారు.

## దరిమడుగులో వరుస దొంగతనాలు

**భయాందోళనలో ప్రజలు**

మార్కాపురం రూరల్, ఆగస్టు 3: మండలంలోని దరిమడుగు గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనలో ఉన్నారు. 15 రోజుల క్రితం నుంచి గ్రామంలో మూడు దొంగతనాలు చోటు చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం దరిమడుగు గ్రామ కూడలిలో ఉండే చదలవాడ శ్రీనివాసరెడ్డి కూల్‌డ్రింక్ షాపులో దొంగతనం చేసి అందులోని కూల్‌డ్రింక్ సీసాలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. సుమారు రూ.30 వేలు నష్టం జరిగినట్లు దుకాణం నిర్వాహకుడు తెలిపారు. 15 రోజుల క్రితం అదే గ్రామంలో రేలా గరిటారెడ్డికి చెందిన హీరోహోండా మోటర్ సైకిల్ చోరీకి గురైంది. అలాగే అదే గ్రామంలో గోన రామానుజులరెడ్డికి చెందిన పల్సర్‌బైకు ఇంటి ముందు ఉండగా చోరీకి గురైనట్లు తెలిపారు. గ్రామంలో వరస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటిముందు ఉంచుకున్న మోటర్ సైకిల్‌లు సైతం దొంగతనాలకు గురవుతుండటంతో ఇంట్లో ఎవరు లేకుండా తాళం వేసి వెళ్లాలంటే భయభయంగా ఉండాల్సి వస్తోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకొని గ్రామంలో దొంగతనాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి



సురేంద్రబాబు (ఫైల్)

పొదిలి, ఆగస్టు 3 : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని పీఎస్ఆర్ కాలనీలో శనివారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం, పొదిలికి చెందిన చల్లా వెంకట సురేంద్రబాబు(40) ఒంగోలులోని పీఎఫ్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఆయన తల్లి దండ్రులు, భార్య పిల్లలు ఒకే ఇంట్లో ఉంటున్నారు. కింది పోర్షన్‌లో తల్లిదండ్రులు ఉంటుండగా, పైన సురేంద్రబాబు ఉంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం కార్యాలయం నుంచి వచ్చాడు. అయితే శనివారం తెల్లవారేసరికి ఉరివేసుకొని సురేంద్రబాబు ఉరివేసుకొని ఉన్నాడు. విషయం తెలుసుకొని ఘటన స్థలాన్ని సిఐ మల్లికార్జున్‌రావ్, ఎస్‌ఐ కోటయ్యలు పరిశీ లించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తలిపారు. కాగా ఘటనపై సురేంద్రబాబు తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేంద్రబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉంటున్నారు.

## రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 : పట్టణంలోని 5వ నంబరు చౌకదుకాణం డీలరు యక్కలి రామలక్ష్మమ్మపై 6ఏ కేసు నమోదు చేసినట్లు మార్కాపురం డివిజన్ ఉపకలెక్టరు రాహుల్‌మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 1న రాత్రి 5వ నెంబరు చౌకదుకాణంలో ఉపకలెక్టర్ రాహుల్ మీనా స్టాకు పరిశీలించారు. గోడౌన్‌లో తీసుకున్న బియ్యం 66.30 క్వింటాలుకాగా, డీలరుకు 38.85 క్వింటాలు పంపిణీ జరిగింది. నిల్వ ఉండవలసిన స్టాక్ బియ్యం 27.45 క్వింటాలు కాగా, షాపులో 40.45 క్వింటాలు నిల్వ ఉంది. దీంతో అక్కడ 13 క్వింటాళ్లు బియ్యం అదనంగా ఉండడంతో ఎక్కడ నుంచి ఈ బియ్యం వచ్చాయని పశ్నించారు. డీలరు నుంచి సరైన సమాదానం రాకపోవడంతో విచారించారు. అక్రమంగా 13 క్వింటాళ్లు బియ్యం నిల్వ ఉంచినందులకు శనివారం డీలరుపై 6ఏ కేసు నమోదు చేసి సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. 5వ నెంబరు చౌకదుకాణం బియ్యం పంపిణీ బాధ్యతలు సమీపంలోని చౌకదుకాణానికి ఇన్‌చార్జ్ ఇవ్వాలని తహసీల్దారుకు ఆదేశాలు ఇచ్చారు.

## ఎలక్ట్రికల్జ్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 : ఎర్రగొండపాలెం ఎస్‌పీఎం కాంట్రాక్టరు మోర్తాల సుబ్బారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు స్థానిక ఎస్‌పీఎంలో ఇంజనీర్ల విధులకు ఆటంకం కల్గించారని ఏపీసీపీడీసీఎల్ డీఈ డి.హరిబాబు గతనెల 30న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్రగొండపాలెం పోలీసులు కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## అధ్వానంగా అంతర్గత రహదారులు



బురదమయంగా ఉన్న రహదారిలో నడిచి వెళుతున్న విద్యార్థులు

గిద్దలూరు, ఆగస్టు 3 : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపున ఉన్న వీదులు చినుకు పడితే అధ్వానంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో కొన్నిటికి మాత్రమే సిమెంటు రోడ్లు వేయగా, మిగతా రోడ్లన్నీ మట్టిరోడ్లుగానే ఉన్నాయి. ఆ ప్రాంతంలో వందలాది నివాసగృహాలు ఉండగా చిన్నపాటి చినుకుపడినా మట్టిరోడ్డంతా బురదమయంగా మారుతోంది. నడిచేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంటున్నది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు మార్జిన్లపై ప్రమాదకరంగా నడవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వృద్దులు, మహిళలు వర్షం పడిన సందర్భాలలో రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వర్షం నీరు రోడ్లపై నిలువ ఉండకుండా ఏర్పాట్లు చేయాలని, శాశ్వత ప్రాతిపదికన సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్లు



కలెక్టర్ అన్సారియాకు బొకే అందజేస్తున్న తహసీల్దార్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 3 : కలెక్టర్ తమీమ్ అన్సారియాను పలువురు తహసీల్దార్లు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకేలు, మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ల సంఘం అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్, చిరంజీవి, బ్రహ్మయ్య, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

### ఇరువురు తహసీల్దార్లు బదిలీ

జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు తహసీల్దార్లను బదిలీలు చేస్తూ కలెక్టర్ అన్సారి యా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కేఎస్ఆర్.కృష్ణారావును అక్కడే డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించగా, కనిగిరి ఆర్డీవో ఆఫీసులో ఏవోగా పని చేస్తున్న ఎస్.ఉషారాణిని ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ స్పెషల్ త హసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# ఆక్రమణదారులపై అధికారుల చర్యలేవి..?

● సచివాలయానికి గతంలో కేటాయించిన భూమి ● ప్రస్తుతం యథేచ్ఛగా కందిసాగు చేసిన ఆక్రమణదారుడు



ప్రస్తుతం పంటసాగు చేసిన ఆక్రమిత భూమి ఇదే

పొదిలి, ఆగస్టు 3 : కంభాలపాడు సచివాలయానికి కేటాయించిన స్థలంలో గత ఏడాది మార్చి 14న ఆక్రమణకు గురైంది. ఈ పొలం పక్కనే ఉన్న పొలం యజమాని ఆ భూమి తనది అంటూ కాలువ తీశాడు. విషయం తెలుసుకున్న నగరపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలాన్ని అదేరోజు పరిశీలించారు. ఆరువాత చర్యలకు ఉపక్రమించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అదేఅదునుగా చర్యలు లేకపోవడంతో ఆక్రమణదారుడు ప్రస్తుతం ఏకంగా దుక్కిదున్ని కందిపంట కూడా సాగు చేసుకున్నాడు. సచివాలయం కోసం ఏర్పాటు చేసిన బోరును సైతం ఆక్రమించి పంట సాగు చేయడంతో పట్టణంలో చర్చాంశనీయమైంది. సుమారు కోటి రూపాయాల విలువైన ఆ భూమిని యథేచ్ఛగా సాగుచేసి ఆక్రమించాడు. సచివాలయంకోసం కేటాంచిన స్థలంలో చూట్టూ కాలువతీసినా చర్యలు లేవు.

కంభాలపాడు గ్రామ సర్వేనంబరు 45-1లో 2.11ఎకరాలు కుంట భూమి ఉంది. అందులో ఎకరం సచివాలయంతోపాటు పలు ప్రభుత్వం కార్యాలయాలకు స్థలం కేటాయించారు. అయితే ఆ పొలం పక్కనే ఉన్న పొలం యజమాని 45-1లో మిగిలిన 1.11 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ దౌర్జన్యంగా పట్టపగలు ఆక్రమించి కాలువ తీశాడు. ఆ తరువాత ఏమైందో తెలీదు గాని ఆ కాలువ అలాగనే వదిలేశారు. ప్రభుత్వ భూముల్లో పట్టపగలు కోట్ల రూపాయల విలువచేసే ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నించడం పట్టణంలో చర్చాంశనీయమైంది. ఒంగోలు నంద్యాల ప్రధాన రహదారిని అనుకొని మరో వైపు సచివాలయంతోపాటు ప్రభుత్వ భవనాలు ఉండడంతో ఈ భూమికి రెక్కలొచ్చాయి. ఈ క్రమంలోనే యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగాయి. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిశీలించిన అధికారులు వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఉన్నతాధికారులు సత్వరమే జోక్యం చేసుకోకపోతే కోట్లాది రూపాయల విలువైన స్థలం అన్యాక్రాంతమై పోవడంలో ఎలాంటి సందేహం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

గిద్దలూరు, ఆగస్టు 3 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ వాయిదా పడుతుండగా కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి వర్గీకరణకు చట్టబద్రత కల్పిస్తూ తీర్మానం చేయడం అభినందనీయన్నారు. . దీనివలన ఎస్సీలలో ఆర్థికాభివృద్ధితోపాటు అన్ని రంగాలలో అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిమల్ల పుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి రామాంజనేయులు, మేథోకమిటీ సభ్యులు రెడ్డి మల్లారెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**వర్గీకరణపై సంబరాలు**



బేస్తవారపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

బేస్తవారపేట : బేస్తవారపేటలోని స్థానిక బస్టాండ్ సమీపంలో శనివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు చేసుకున్నారు. నాయకులు బూదాల ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు షాలేంరాజు పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో మాదిగజాతిలో పండుగ వాతావరణ ఏర్పడిందన్నారు. రాష్ట్ర నాయకులు వర్గీకరణ కోసం చేసిన కృషి అభినందనీయమన్నారు. కెక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దఎత్తున అభినందన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జయరాజ్, భరణి, టీడీపీ నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, బుద్దుల ప్రేమానంద్, జడ్‌పీటీసీ మాజీ సభ్యులు ఐజయ్య లూ కా పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరాలకు విశేష స్పందన

**న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ**



మందులు పంపిణీ చేస్తున్న బాలాజీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 3 :పేదలకు వైద్యసేవలు అందించి వారికి సంపూర్ణ ఆరోగ్యం కల్గించాలన్న ఉద్దేశ్యంతో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మార్కాపురం సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం బాలాజి అన్నారు. ఎర్రగొండపాలెం పరిధిలోని తిరుమలగిరికాలనీలో శనివారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన న్యాయాధికారి ఎం బాలాజి మాట్లాడుతూ వైద్యశిబిరాలు ఏర్పాటు వలన దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించ వచ్చునని, సకాలంలో ఉన్నత వైద్యసేవలు చేయడానికి కార్పొరేషన్ వైద్యశాలలకు రిఫర్ చేయడం వలన వ్యాధిగ్రస్థులకు మేలు జరుగుతుందన్నారు. 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరంలో వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు కోటానాయక్, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందించారు.

గిద్దలూరు టౌన్, ఆగస్టు 3 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ అన్నారు. మండలంలోని దిగువమెట్ట చెంచుకాలనీ నందు గల ప్రాథమిక పాఠశాల నందు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరం నందు కెఎస్‌పల్లె వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొని శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమల వలన వ్యాధులు సంభవించి ప్రజలు ఇబ్బందుల పాలు అవుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు దోమల నియంత్రణకు బాల్యవివాహాలను అరికట్టాలని, గృహ హింస చట్టం, భరణం గురించి తెలిపారు. న్యాయపరమైన సలహాలకు ఉచిత న్యాయ సహాయం కోసం గిద్దలూరు కోర్టులోని మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి టోల్‌ఫ్రీ నెంబరు 15100 అని తెలిపారు. డాక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నవయస్సులోనే బాలికలకు వివాహం చేయవద్దని, చిన్నతనంలోనే గర్భం దాల్చడం వలన వారికి ఆరోగ్య సమస్యలకు గురవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ కాచి చల్లార్చిన నీటిని తాగితే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఐఆఆర్‌డి చెన్నారావు, గుండ్లకమ్మ డిప్యూటి ఆఫీసర్ డి.మురళీకృష్ణ, న్యాయవాది ఎం.పిచ్చయ్య, ఏపీవో ఎ.సురేష్, జి.రంగ నాయకులు, జి.రాఘవరావు, ఏఎస్సై ఎల్.రంగయ్య, దిగువమెట్ట సర్పంచ్ లోకా నాయక్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

# అన్నార్తులకు అండగా అన్నక్యాంటీన్లు

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మదన్



పేదలకు అన్నదానం చేస్తున్న మదన్, పలువురు నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 3: తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లు అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాయని టీడీ పీ శ్రేణులు పేర్కొన్నాయి. శనివారం ఒంగోలు న గరం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బండా రు మదన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ప ట్టణాల్లో పేదలకు ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఆ త ర్వాత అధికారంలోకి వచ్చిన సైకో పాలనలో పేద ల నోటిదగ్గర అన్నం లాగేసిందని విమర్శించారు. తిరిగి ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టడంతో పేద ప్రజల ఆకలి కష్టాలు తీరాయన్నా రు. అందులో భాగంగా ఎమ్మెల్యే దామచర్ల జనా ర్దన్ సూచనతో దాతలు మందుకు వస్తున్నారని, ప్రతిరోజు పేదలకు ఉచితంగా అన్నం వడిస్తున్న ట్లు తెలిపారు. 7, 8 డివిజన్ కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, సంద్రపాటి వర్ష్‌వర్త్ మాట్లా డుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోయి, ప్రజలు మెచ్చిన పాలన వచ్చిందన్నారు. నియోజకవర్గ టీ డీపీ శ్రేణుల సహకారంతో ప్రతి రోజు నగరంలోని నాలుగు అన్నక్యాంటీన్లలో సుమారు 1500మందికి ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, షేక్ కపిల్‌బాషా, శశికాం త్‌భూషణ్, బోను దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల మాసోత్సవాలు

త్రిపురాంతకం, అగస్టు 3: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల మాసోత్సవాలను మండలంలోని ఒడ్డుపాలెంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ హైమావతి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టినబిడ్డలకు తల్లిపాలను అరు మాసాల వరకు ఖచ్చితంగా ఇవ్వాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా మాసోత్సవాల బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిచ్చయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.లక్ష్మీ, దీవెనమ్మ, నారాయణమ్మ, ఎం.లక్ష్మీ, ఏఎన్ఎం విశాలి, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో పాల్గొన్న తల్లులు, చిన్నారులు

**తల్లిపాలు అమృతం వంటివి**

కంభం : తల్లిపాలు అమృతంతో సమానమని, పిల్లలకు తల్లిపాలు పట్టించడం వలన ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యవంతంగా, బలంగా, దృఢంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో చెంచులక్ష్మి తెలిపారు. మండలంలోని అర్బన్‌కాలనీలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి ర్యాలీ నిర్వహించారు. తమ పిల్లలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లులు డబ్బాపాలు, గేదెపాలు ఇవ్వకుండా తమ పాలనే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ కళావతి, ఏఎన్ఎం సోని, ఎంఎస్‌కే మల్లిక, సచివాలయ సెక్రటరీ కృష్ణమోహన్‌రెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు శ్రీదేవి, ఆదిలక్ష్మి, ఆశవర్కర్లు విజయలక్ష్మి, పి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగొండపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఎర్రగొండపాలెం : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమ ని, బిడ్డపుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని అంగన్వాడీ కార్యకర్తలు తల్లులకు సూచించారు. ఎర్రగొండపాలెంలోని బీసీ అంగ న్వాడీ కేంద్రం పరిధిలో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు శనివారం తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు షేక్ శంషాద్, తిరుపాలమ్మ, తల్లులు, ఏఎన్ఎంలు, ఆయాలు పాల్గొన్నారు. మండలంలోని తమ్మడపల్లి, గంగుపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

## అవీ..ఇవీ..

### భక్తిశ్రద్ధలతో గణపతి ప్రతిష్ఠ వార్షికోత్సవం



బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

పెద్ద దోర్నాల, ఆగస్టు 3: మండలంలోని ఐనముక్కల గ్రామంలో గణపతి దేవాలయంలో గణనాథునికి అదేవిధంగా ఆంజేనేయస్వామి, పోలేరమ్మ, అంకాళమ్మ విగ్రహ ప్రతిష్టా రెండవ వార్షికోత్సవ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆయా ఆలయాల్లో ఆలయ అర్చకులు కాకర్ల లక్ష్మీప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో వేదపండితులు గణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్దసంఖ్యల్లో అమ్మవారికి బోనాలతో తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించారు. వానలు బాగా కురవాలని, గ్రామంలో ఎలాంటి వ్యాధులు లేకుండా సుఖశాంతులతో ఉండేలా దీవించాలని కోరుతూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చిట్యాల రామకృష్ణారెడ్డి, గొల్మారు శేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆదినారాయణ, జంగిలి పిచ్చయ్య, యక్కంటి లింగారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

### నేడు శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



చౌడేశ్వరి అమ్మవారు

బేస్తవారపేట,ఆగస్టు3: బేస్తవారపేట బీసీ కాలనీలోని శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి జన్మదిన వేడుకల్లో భాగంగా నేటి ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని వారు కోరారు.

### పాఠశాల ఎన్నికలపై అవగాహన



హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎంఈవో

కంభం, ఆగస్టు 3 : రాజకీయాలకు అతీతంగా పాఠశాలల్లో జరిగే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో మాల్యాద్రి హెచ్‌ఎంలకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంప్లాయిస్ ఇన్సరేషన్ వివరాలు, పాఠశాలల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు కేశవ, వీరనారాయణ, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

### రైతులు రెండు పంటలు దిగుబడి తీసుకోవాలి



పైరును పరిశీలిస్తున్న ఏడీఏ

కంభం, ఆగస్టు 3 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఎఫ్ఎన్ ఎస్ పథకం కింద మొదటిపంటగా చిరు ధాన్యాల రెండవ పంట గా శనగను సాగు చేసుకోవాలని మార్కా పురం ఏడీఏ డి.బాలాజీ నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో కొర్ర సాగు చేసిన పొలాలను ఏవో స్వరూప, ఏఈవో పాపారావులతో కలిసి పరిశీలించారు. కొర్రలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### 7న ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

బేస్తవారపేట, ఆగస్టు 3 : బేస్తవారపేట మండలంలో గత ఏడాది చేపట్టిన ఉపాధి పనుల్లో భాగంగా కూలీలు చేసిన పనులు, పండ్లతోటల పెంపకం తదితర పనులను వారం రోజుల నుండి తనిఖీ సామాజికి తనిఖీ బృందం పరిశీలించింది. ఈ వివరాలతో ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు.

### పరిశుభ్రంగా ఉంచాలి

గిద్దలూరు, ఆగస్టు 3 : పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం కోసం ఘాట్ రోడ్డు ఏర్పాటు చేయగా ఈ రహదారిని పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు. కొండపైన ఉన్న దేవాలయానికి మొదటి నుంచి మెట్లమార్గం ఉండగా రాజానగర్ నుంచి వాహనాలు నేరుగా పైకి వెళ్ళేందుకు వీలుగా ఘాట్ రోడ్డును నిర్మించారు. అయితే ఈ రోడ్డులో బహిరంగ మలవిసర్జన జరుగుతుండడంతో ఆలయానికి వచ్చి, పోయే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని, రక్షణ గోడ నిర్మించి, మలవిసర్జన జరగకుండా మున్సిపల్ అధికారులు, దేవస్థాన సిబ్బంది చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఏవో జవహర్‌లాల్ నాయక్



పైరును పరిశీలిస్తున్న ఏవో జవహర్‌లాల్‌నాయక్

పెద్ద దోర్నాల, ఆగస్టు 3: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పైరును మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో పచ్చదోమ, పేనుబంక ఆశించిందని నివారణకు ఎసిఫేట్ 75శాతం ఎస్‌పీ 1.5 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ హరిజననాయక్, రాజేంద్ర ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

### వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గిద్దలూరు, ఆగస్టు 3 : కేరళలోని వాయనాడ్ ప్రాంతంలో వరద బాధితులకు సహాయం అందించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థుల నుంచి రూ.6715 విరాళాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కొమ్మునూరి అరుణ్, కార్యదర్శి బండా ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అంజన్‌కుమార్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని నిర్మాణానికి పింఛన్ సొమ్మును విరాళంగా చంద్రబాబుకు అందజేస్తున్న వెంకటరావు

## రాజధాని నిర్మాణానికి పింఛన్ సొమ్ము విరాళం

దర్శి, ఆగస్టు 3: దర్శి పట్టణానికి చెందిన రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల ఆర్గనైజింగ్ కార్యదర్శి దివ్యాంగుడు సందు వెంకటరావు తనకు వచ్చిన రూ.10వేల పింఛన్ సొమ్మును అమరావతి రాజధాని నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారు. అమరావతిలో శనివారం సీఎం చంద్రబాబును వెంకటరావు కలిసి రూ.10 వేలను అందజేశారు. దివ్యాంగుల స్ఫూర్తిని సీఎం అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఓబయ్య, వై.ఏడుకొండలు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

వెలిగండ్ల, ఆగస్టు 3: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎం.సువర్ణ అన్నారు. వెలిగండ్ల తహసీల్దార్‌గా ఎం.సువర్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దొనకొండలో పనిచేస్తూ ఎన్నికల్లో విధుల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్ళారు. అక్కడ నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా వెలిగండ్లకు వచ్చారు. ఈసందర్భంగా సువర్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

## లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

దర్శి, ఆగస్టు 3: లీగల్‌సెల్ ఆధ్వర్యంలో దర్శి నగర పంచాయతీలోని సాయినగర్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కె.చేతన్ రోగులకు పరీక్షలు చేపట్టి అవసరమైన మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చెన్నకేశవులు, పి.సురేష్, లీగల్‌సెల్ వలంటీర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, ఆగస్టు 3: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల జోన్ సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) నిర్వాహణను శనివారం పరిశీలించారు. షెడ్యూల్ కులాల రైతులకు పట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేవిధంగా మెలకువలు తెలుసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో కేవీకే ప్రధాన అధికారి డాక్టర్ బి.రమేష్, శాస్త్రవేత్తలు టి.మానస, ఎస్.లీలాకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

దొనకొండ, ఆగస్టు 3: అవయవదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగు నింపవచ్చునని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.దనుమని అన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రమాదాల ద్వారా అవయవాలు ఎలా కోల్పోతారు, ప్రమాదాలు జరగకుండా ఎలా నివారించాలి, అవయవదానం ప్రాముఖ్యత తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

కనిగిరి, ఆగస్టు 3: పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. నగరంలోని ఉప్పు రోడ్డులో జరుగుతున్న రేషన్ పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. మొబైల్ వాహనం ద్వారా జరిగే పంపిణీలో ప్రభుత్వం అందించే రేషన్ సరకులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవకటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన ఎంఎస్ఎం విద్యార్థులు

కనిగిరి, ఆగస్టు 3: ఆంధ్రకేసరి (ఏకేయూ) డిగ్రీ ఫస్ట్ ఇయర్ రెండవ సెమిస్టర్‌లో ఎంఎస్ఎం కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఫస్ట్ ఇయర్ బీఎస్సీ / బోటనీలో చెరుకూరి లక్ష్మీఇంద్రాణి 400 మార్కులు, కోలా మెరినా 399 మార్కులు సాధించారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో షేక్ నస్రీన్ 376 మార్కులు, కిన్నెక స్వాతి 371 మార్కులు పొందారు. బీకాం కంప్యూటర్స్‌లో యర్రబల్లి రాజకమల్ 343 మార్కులు, బండారులు వైష్ణవి 337 మార్కులు సాధించారు. బీసీఏలో షన్నం నరేష్ 316 మార్కులు, బీబీఏలో షేక్ కాకర్ల సల్మా 248 మార్కులు, బీఎస్సీ వీఓసి(అగ్రికల్చర్)లో బద్దిపూడి నేహాదాస్ 297 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, అధ్యాపక బృందం అభినందించారు.

## అసంబద్ధ సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 3: సీఎస్‌పురం మండల పరిధిలో ఇటీవల వేసిన అసంబద్ధ సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఏ రూల్ ప్రకారం సర్దుబాటు నిర్వహించారో స్పష్టంచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, నాయకులు డి. సుబ్బరాయుడు, కె.చెన్నయ్య, జి.రామకృష్ణ, బి.చిననారాయణ, హమాద్ పాల్గొన్నారు.

## నేడు పామూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు, ఆగస్టు 3: పామూరులో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్ జిలానీ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 'ఎస్సీ వర్గీకరణను అంగీకరించం'

తాళ్లూరు, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించేదిలేదని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య అన్నారు. తాళ్లూరులోని అంబేడ్కర్ నగర్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అంజయ్య, మాలమహానాడు నేతలు శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చుక్కా నాని, పులుగు రవికుమార్, బి.సురేష్, పులి కోటేష్, బంటుపల్లి ప్రకాశం, పులుగు చినమోష, ఆదాం, తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల జీవనోపాధికి గండి

- పేరుకే సొసైటీ చెరువులు
- చేపలు పెంచుకునేది వ్యాపారులు
- ముడుపులు తీసుకొని సహకరిస్తున్న అధికారులు
- ఒట్టిపోయిన చెరువులు
- నీరులేక జీవాలు విలవిల



నీరు వెళ్లగొట్టి చేపలు పట్టడంతో ఒట్టిపోయిన పొతకమూరు చెరువు

దర్శి, ఆగస్టు 3: మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు ఏర్పాటుచేసిన సొసైటీలు వారి ఆశయానికి గండి కొడుతున్నాయి. చెరువులను ఏర్పాటుచేసి చేపలు పెంచుకునేందుకు వీలుగా సొసైటీలను ఏర్పాటుచేశారు. అయితే, ఇవి పేరుకు మాత్రమే మత్స్యకారుల సొసైటీలు. చేపలు పెంచుకునేది మాత్రం వ్యాపారులు. నిబంధనలకు విరుద్ధంగా మత్స్యకారులను లోబర్చుకొని వ్యాపారులు ఇష్టారాజ్యంగా సొసైటీ చెరువుల్లో చేపలు పెంచుకొని వ్యాపారం చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదు. ముడుపులు తీసుకొని వ్యాపారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బలహీన వర్గాలకు చెందిన మత్స్యకారులు బడాబాబులకు ఎదురుచెప్పలేక వారిచ్చిన కొద్దిపాటి సొమ్ము తీసుకొని సర్దుకుంటున్నారు.

దర్శి మండలంలోని పోతకమూరు, తూర్పువీరాయపాలెం, ముండ్లమూరు మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు చెరువులను ఒక సొసైటీగా ఏర్పాటుచేశారు. ఈ నాలుగు చెరువులను పులిపాడు మత్స్యకారుల సొసైటీ పరిధిలోకి చేర్చారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ నాలుగు చెరువులు రికార్డుల ప్రకారం మత్స్యకారుల ఆధ్వర్యంలో చేపల పెంపకం జరుపుతున్నట్లు లెక్కలు రాశారు. వాస్తవంగా నర్సరావుపేటకు చెందిన ఒక చేపల వ్యాపారి ఈ చెరువుల్లో చేపలు పెంచుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ళల్లో ఆ వ్యాపారి చేపల చెరువుల్లో చేపలు పెంచుకొని విక్రయించుకున్నాడు. మత్స్యశాఖ అధికారుల లెక్కల్లో మాత్రం సొసైటీ సభ్యులు చేపలు పెంచుకున్నట్లు రికార్డులు రాశారు. ఆ వ్యాపారి వైసీపీ ప్రజాప్రతినిదులకు ముడు పులు ఇచ్చి తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. నిబంధనల ప్రకారం సొసైటీలకు ప్రతి ఏడాది మత్స్యశాఖ అధికారులు చేపలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా ఆ వ్యాపారి సొసైటీ సభ్యుల పేర్లతో ఎప్పటికప్పుడు సంతకాలు చేయించుకొని వారే చెరువులు తీసుకున్నట్లు వ్యవహారం నడిపారు. అదేక్రమంలో ఈ ఏడాది కూడా చేప పిల్లలు వేసుకోవాలనే ఉద్దేశంతో పొతకమూరు చెరువు చుట్టూ కంచె వేశాడు. చెరువుకు నీరు రాగానే చేప పిల్లలు వేసేందుకు సన్నద్ధం చేస్తున్నాడు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పొతకమూరు పంచాయతీలోని నాయకులు ఆ వ్యాపారిని అడ్డుకున్నారు. సొసైటీ చెరువులో మీకేం పని అని ప్రశ్నించటంతో ప్రస్తుతానికి మిన్నకుండిపోయాడు. ఈవిషయంపై మత్స్యకారుల అధికారులను వివరణ కోరగా.. మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలోనే చేప పిల్లలను వేసి పెంచుకోవాల్సి ఉందన్నారు. వ్యాపారులు చేపలు పెంచుకునే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



చేప పిల్లలు వేసేందుకు కంచె వేసిన వ్యాపారులు

### నీటిని వెళ్లబెట్టిన వ్యాపారులు

నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ చెరువుల్లో వ్యాపారులు చేపలను పెంచుకోవటమే కాక పట్టుకునే సమయంలో నిల్వ ఉన్న నీటిని వదిలేశారు. పొతకమూరు చెరువులో చేపలు పట్టుకునేందుకు రెండు నెలల క్రితం తూములు ఎత్తి వదిలేశారు. దీంతో ఆ చెరువు వట్టిపోయింది. ఆ ప్రాంతంలోని పశువులు, గొర్రెలు మేకలు తాగునీటి కోసం నీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. మిగిలిన చెరువుల్లో కూడా చేపలు పట్టే సమయంలో నీటిని వదిలేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావ టంతో ఇప్పుడైనా నిబంధనలకు అనుగుణంగా చేపల పెంపకం జరిగే విధంగా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 161 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



గోడౌన్‌లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కనిగిరి, ఆగస్టు 3: మండలంలోని చాకిరాల వద్ద గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 161 బస్తాల బియ్యాన్ని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నట్లు ఒంగోలు ఐఈడీటీ కృష్ణమోహన్ తెలిపారు. సంబంధిత గోడౌన్ యజమానిపై కేసు నమోదు చేసి బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కాగా, చాకిరాల పంచాయతీ పరిధిలో నిి కనిగిరి- సీఎస్‌పురం రోడ్డులో ఉన్న గోడౌన్‌లలో కోళ్ళఫారంతో పాటు మొక్కజొన్న గింజలు తీసే మిషనరీ గోడౌన్ ఉంది. ఆ మిషన్ ద్వారా మొక్కజొన్నలను నూకలుగా మార్చి వాటిని కోళ్ళకు మేతగా వాడుకుంటున్నారు. దాంతోపాటు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచి మొక్కజొన్నలు తరలించే లారీల ద్వారా పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఈ బియ్యం దందా విషయం సమాచారం ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చేరింది. దీంతో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐఈడీటీ కృష్ణమోహన్, పొదిలి ఈడీటీ డేవిడ్, దొనకొండ ఈడీటీలతో కలసి బృందంగా తనిఖీలకు శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటలకు వెళ్ళారు. ఆయా గోడౌన్‌లలోకి వెళ్లడానికి ప్రధాన ద్వారం వద్ద ఉన్న సెంట్రీ లోపలికి పోనివ్వలేదు. తాళం వేసేసి లోపలికి వెళ్ళిపోయాడు. దీంతో వెనుదిరిగినట్లుగా వచ్చేసి అధికారులు మాటు వేశారు.

శనివారం తెల్లవారుజాము సమయంలో కోళ్ళఫారంలో లోపలి నుంచి ఇద్దరు వ్యక్తులు బయటికి వెళ్లేందుకు ప్రధాన గేటు తెరిచారు. వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లోపలికి ప్రవేశించారు. గోడౌన్‌లను తెరిపించి చూడగా మొక్కజొన్న బస్తాలు 30 అడుగుల మేర పైకి పేర్చి ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం వాటిని పక్కకు తొలగింపు చర్యలు చేపట్టారు. వాటి మాటున భారీస్థాయిలో బియ్యం బస్తాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని పరిశీలించగా అవి పీడీఎస్ బియ్యంగా గుర్తించారు.

సంబంధిత గోడౌన్ యజమానిపై కేసు నమోదు చేసి బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.

## విద్యతో ఉన్నతస్థానాలకు చేరుకుంటారు..



విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న ఎంఈవో-2 సుధాకర్‌రావు

తాళ్లూరు, ఆగస్టు 3: విద్యార్థులు చదువును మధ్యలో మానివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. మండలంలోని వెలుగువారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు విద్యార్థులను శనివారం పాఠశాలలో చేర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యవల్ల జ్ఞానం పెరిగి ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. విద్యావంతులైన కుటుంబాలు అన్నిరంగాల్లో మెరుగ్గా ఉంటారన్నారు. చదువుయొక్క ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. మధ్యాహ్నభోజన పథకాన్ని, మురుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో సజావుగా జరపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు వి.మస్తాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సచివాలయ భవనం వినియోగంలోకి వచ్చేనా!

- ఆరు నెలల క్రితం జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభం
- నిర్మాణ బిల్లులు చెల్లిస్తేనే తాళాలు ఇస్తానంటున్న వైసీపీ నేత
- పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు



నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం

తాళ్లూరు, ఆగస్టు 3: లక్షలాది రూపాయలతో అన్నిహంగులతో నిర్మించిన తురకపాలెం గ్రామసచివాలయాన్ని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు. సచివాలయం భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్, గ్రామ వైసీపీ కీలక నేత అధికారులకు తాళాలు ఇవ్వలేదు. దీంతో నూతన భవనం నిరుపయోగంగా ఉంది. భవన నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పంచాయతీరాజ్ అధికారులకు భవనం స్వాధీనం చేయాల్సి ఉంది. తనకు బిల్లులు చెల్లించే వరకు తాళాలు ఇచ్చేదిలేదన్నట్టుగా సదరు వైసీపీ నేత వ్యవహరిస్తున్నారు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తన అనుచరుని ఇంటిని అద్దెకు తీసుకుని సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఎన్నికయ్యేవరకు అధికారులు అద్దె చెల్లించ లేదు. సర్పంచ్ అద్దె చెల్లించలేదన్న సాకుతో అనేక సార్లు సచివాలయానికి తాళాలు వేసి సిబ్బంది విధుల్లోకి రాకుండా ఇంటి యజమాని అడ్డుకున్నారు. ఈవిషయాన్ని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం చేకూరలేదు. ఈక్రమంలో నూతన సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తికాగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆరునెలల క్రితం ప్రారంభించారు. ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నూతన సచివాలయ భవనంలోని మార్చేందుకు టీడీపీ సర్పంచ్ యత్నించాడు. కొత్త భవనంలోకి వెళితే తమ అద్దె చెల్లించరన్న కారణం చూపుతూ ఇంటి యజమాని ఇటీవల సచివాలయానికి తాళం వేసి సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు.

ఇదిలాఉండగా నూతన భవనంలోకి వెళ్లేందుకు సర్పంచ్ ప్రయత్నిస్తుండగా, తన బిల్లులు చెల్లించే వరకు తాళాలు ఇవ్వనని వైసీపీ కీలక నేత ప్రకటించినట్టు తెలిసింది. ఈవిషయాన్ని సర్పంచ్ చంద్రగిరి గుర్వారెడ్డి ఎంపీడీవో యుగకీర్తి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఎంపీడీవో మాత్రం ఉన్నతాధికారులతో సంప్రదించి నూతన సచివాలయంలోకి మార్చుచేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని సర్పంచ్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనంలోకి తురకపాలెం సచివాలయాన్ని మార్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం



కనిగిరి: కంచర్లవారిపల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

దొనకొండ, ఆగస్టు 3: తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం, సురక్షితమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి అన్నారు. మండలంలోని నరసింహనాయునిపాలెం, పెద్దన్నపాలెం, గంగదేవిపల్లి, ఆరవళ్లిపాడు, చందవరం, దేశిరెడ్డి పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డకు కావాల్సిన విటమిన్స్, ప్రొటీన్స్ లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు విన్యాసమ్మ, పవన్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు శేషమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, తనూజ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని బొట్లగూడూరు, అప్పమాంబపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ జీ.పద్మజ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, పి.రమణమ్మ, కుమారి, మంగమ్మ, ప్రత్యూష మృణాళిని పాల్గొన్నారు.

### తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

పామూరు, ఆగస్టు 3: చంటి బిడ్డల ఆరోగ్యానికి తల్లి పాలే శ్రేష్ఠమని హెల్త్ సూపర్‌వైజర్ నిర్మలకుమారి అన్నారు. పట్టణంలోని 2వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన అవగా హన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డబ్బా పాలతో భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమం తాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ షేక్ గుల్జార్‌బి, వీవీ నాగవాణి, ఎన్.బ్రహ్మానందం, పి.శ్రీధర్, చినసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 3: చంటి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి తల్లిపాల విశిష్ఠతను వివరించారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి ముర్రుపాలు ఇవ్వటం ఆ బిడ్డకు జీవితాంతం ప్రాణవాయువు లాంటిదన్నారు. ఎలాంటి అనారోగ్యాన్నైనా నిరోధించుకోగలిగే శక్తి లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. .

## తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, ఆగస్టు 3: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పైర్లలో తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచిం చారు. మండలంలోని చందలూరులో రైతులు సాగు చేసిన కంది, సజ్జ, పత్తి పైర్లను శనివారం పరిశీలించారు. కందిపైరుకు వైరస్ తెగుళ్ళు సోకకుండా సల్ఫర్ పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు సత్వరమే పురుగు మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్, రైతులు పాల్గొన్నారు.



పైర్లను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి మనోహర్, చైర్‌పర్సన్ క్రిస్టినా



# అభివృద్ధి దిశగా అడుగులు

- కులమతాలు, పార్టీలను పక్కన పెట్టాలి
- కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకువస్తా
- గ్రామాల అభివృద్ధికి ఉపాధి నిధులు వినియోగించుకోవాలి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- గుంటూరు జిల్లాకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి : మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు సిటీ, ఆగస్టు 3: రాజకీయాలు ఎన్నికల వరకే. ప్రస్తుతం పార్టీలను పక్కన పెట్టేద్దాం. కులమతాలకు, పార్టీలకు అతీతంగా జిల్లాను అభివృద్ధి చేసుకునేందుకు అడుగులు ముందుకేద్దాం.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ సడక్ యోజన కింద రోడ్లు లేని ప్రాంతాలకు రోడ్ల నిర్మించుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగ పరుచుకుని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, చెరువులు, కాల్వలు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.6 వేల నుంచి రూ.7 వేల కోట్లు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి పేదవాడికి ఉండటానికి ఒక ఇంటిని ఇవ్వాలన్న ఆలోచనతోనే నిబంధనలు కూడా సవరించామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం కోసం విలువలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీలకతీతంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జడ్పీటీసీలు అభివృద్ధిని అడ్డుకోవద్దని, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నాదెండ్ల సూచించారు. అందరూ కలిసి ఉమ్మడి గుంటూరు జిల్లా పూర్వ వైభవానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఎంపీపీ, జడ్పీటీసీల గౌరవ వేతనం రూ.20 వేలకు పెంచేలా చూడాలని కోరారు. 2022, 23 సంవత్సరాలకు సంబంధించిన మైనింగ్ సెస్సు మండల పరిషత్‌లకు రాలేదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవి విడుదలయ్యేలా చూడాలని కోరారు.

## రూ.100 కోట్లు రావాలి : చైర్మన్

జిల్లా పరిషత్‌కు న్యాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు రావాల్సిందని జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా పరిషత్ భవనం కూలిపోయే పరిస్థితుల్లో ఉందని పాత ముఖ్యమంత్రిని ఎన్ని సార్లు కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో జడ్పీటీసీలకు నిధులు కేటాయించలేక పోయామన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు పదవులు అలంకారప్రాయంగా మాత్రమే మిగిలి పోయాయని చెప్పారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను పక్కదారి పట్టించడం వల్ల గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయిందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతుల కార్డులు, అంటువ్యాధులు, విద్యాశాఖలో సమస్యలు తదితర అంశాలను అజెండాలో చేర్చాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ పనుల్లో లోపాలు ఉంటే విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ యేసురత్నం తెలిపారు. కక్షసాధింపులకు పాల్పడకుండా అభివృద్ధితో ముందుకు వెళ్లాలన్నారు.

### ★ జగనన్న కాలనీల్లో అవినీతి : ఆనందబాబు

జగనన్న కాలనీల్లో భారీగా అవినీతి జరిగిందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆరోపించారు. కాలనీలో లెవెలింగ్ పనుల పేరుతో కోటానుకోట్లు అవినీతి చేశారన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల స్థానిక స్వపరిపాలన సంస్థలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. స్థానిక సంస్థల్లో ఉన్న ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యేలతో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### ★ జల్ జీవన్ పనుల్లో లోపాలు : శ్రావణ్‌కుమార్

జల్ జీవన్ పనుల్లో లోపాలు ఉన్నాయని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ పనుల కోసం అన్ని గ్రామాల్లో ఉన్న సిమెంట్ రోడ్లను పగలగొట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తాడికొండ నియోజకవర్గంలో వేసవిలో తాగునీటికి ఇబ్బంది ఉందని చెప్పారు. వచ్చే సమావేశంలో ఈ పనులపై ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

### ★ వెంటిలేటర్‌పై పల్నాడు : జూలకంటి

అభివృద్ధిలో అన్ని విధాల వెనుకబడిన పల్నాడు జిల్లా వెంటిలేటర్ మీద ఉన్న పేషంట్‌లా ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు కేటాయించే విధానంలో పల్నాడుకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు మండలాలు కలిగిన మాచర్లకు కేవలం రూ.8 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. మిగిలిన నియోజకవర్గాల్లో రెండు మండలాలకు రూ.8 కోట్లు కేటాయించిన ఉదంతాలు ఉన్నాయన్నారు. కూత వేటు దూరంలోనే నాగార్జునసాగర్ ఉన్నప్పటికీ ఆ నీళ్లను తాగలేని పరిస్థితి మాచర్ల నియోజకవర్గంలోని ప్రజలదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ★ టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి : అరవిందబాబు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు మధ్యలో ఆగిపోయాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల నిర్మాణాలను ఆపేసిందని, పూర్తి అయిన ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం చేసిందన్నారు. నరసరావుపేటలో 6000 కుపైగా ఇళ్ళు అసంపూర్ణ దశలో ఉన్నాయని తెలిపారు.

### ★ జడ్పీటీసీలు కలిసి రావాలి : ప్రవీణ్

గ్రామాల అభివృద్ధి కోసం జడ్పీటీసీలు ఎమ్మెల్యేలతో కలిసి రావాల్సిన అవసరం ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో దుర్మార్గంగా జరిగాయన్నారు. వచ్చే జడ్పీ సమావేశంలో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొనేలా చూడాలని చైర్ పర్సన్‌ను కోరారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యేలు ప్రవీణ్, శ్రావణ్‌కుమార్, అరవిందబాబు, బ్రహ్మారెడ్డి, ఆనందబాబు, నరేంద్రవర్మ, ఎమ్మెల్సీలు ఏసురత్నం, లక్ష్మణరావు

### 2.5 లక్షల ఇళ్లకు 70 వేలే నిర్మాణం

గత ప్రభుత్వంలో కేంద్రం రాష్ట్రానికి రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఐదేళ్ల జగన్ ప్రభుత్వం హయాంలో కేవలం 70 వేల ఇళ్లు మాత్రమే నిర్మాణం జరిగాయి. వాటికి కూడా ఒకటి, రెండు వాయిదాలు మాత్రమే లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. తాజా బడ్జెట్ వల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు 10 లక్షలు, పట్టణ ప్రాంతాలకు మరో ఐదు లక్షల ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రూ.800 కోట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖలో ఉన్నాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ ఫండ్ ఇస్తే ఆ నిధులు వచ్చే అవకాశం ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి రూ.14 వేల కోట్లు మంజూరైతే గత ప్రభుత్వంలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వినియోగించింది. మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్మును ఏ రీతిగా చెల్లించాలి అనే దానిపై సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

### స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంపిక

జడ్పీ సర్వసభ్య సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

**ప్రణాళిక, ఆర్థిక స్టాండింగ్ కమిటీ** : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు
**గ్రామీణాభివృద్ధి** : కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, జీవీ ఆంజనేయులు
**వ్యవసాయం** : ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు
**విద్య, వైద్యం:** మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి
**మహిళా సంక్షేమం:** ఎమ్మెల్యేలు యరపతినేనిశ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు
**సాంఘిక సంక్షేమం:** ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్
**పనులు:** మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్

# కృష్ణమ్మ.. వడివడిగా

- సాగర్‌కు పోటెత్తుతోన్న వరద
- 3.91 లక్షల కూసెక్కుల ప్రవాహం
- 570 అడుగుల అడుగులకు చేరిన మట్టం
- రెండు రోజుల్లో తెరుచుకోనున్న సాగర్ గేట్లు
- రెండు రోజుల్లో నిండుకుండలా పులిచింతల


పులిచింతల నుంచి విడుదలవుతున్న నీరు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), కారంపూడి, ఆగస్టు 3: కృష్ణమ్మ.. పరుగులు పెడుతూ వస్తోంది. పోటెత్తిన వరదతో జలాశయాలు నిండుకుండల్లా మారుతున్నాయి. ప్రాజెక్టు గేట్లు తెరుచుకుని నాగార్జున సాగర్ దిశగా పరవళ్లు తొక్కుతూ పయనం సాగిస్తోంది. భారీగా వరద నీరు వస్తుండటంతో సాగర్ జలాశయం జలకళను సంతరించుకుంది. సాగర్ జలాశయంలోకి శనివారం రాత్రి 9 గంటలకు 4,57,923 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. డ్యాం సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా రాత్రికి నీటి నిల్వ 250.14 టీఎంసీలకు చేరింది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 570 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 5.34 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు వరద వారం రోజులకు పైగా కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఆదివారానికి ఐదు లక్షల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తుందని అంచనా. ఇదే ప్రవాహం కొనసాగితే రెండు మూడు రోజుల్లో సాగర్ క్రస్ట్ గేట్లు తెరచి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. నాలుగు రోజుల్లో సాగర్‌కు 76.23 టీఎంసీల నీరు వచ్చింది. శ్రీశైలం సహా ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీటిని లెక్కిస్తే సాగర్ రెండు రోజుల్లో నిండుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. సాగర్ నుంచి 31,510 విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ కుడి కాల్వకు 5,944 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుగ్గవాగుకు 5,190 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఇక్కడ నుంచి కుడి కాల్వకు 4,923 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### పులిచింతలకు 25332 క్యూసెక్కులు విడుదల

పులిచింతల జలాశయానికి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9398 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ వెంకటరమణ చెప్పారు. సాగర్ నుంచి విద్యుదుత్పత్తి అనంతరం 27507 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు. దీంతో రిజర్వాయర్‌లో 75.02 మీటర్లు అంటే 6.751 టీఎంసీల నీరుందన్నారు. డ్యాంకు సంబంధించి 4 క్రస్ట్‌గేట్లు 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 17048 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8284 క్యూసెక్కులు మొత్తం 25332 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద ముంచెత్తుతుండటంతో రెంటచింతల తహశీల్దార్ కరుణకుమార్ శనివారం టెయిల్‌పాండ్ ప్రాజెక్టును సందర్శించారు. సుమారు 1900 హెక్టార్లలో ఉన్న రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండిపోయింది. ఎగువ నుంచి వచ్చిన నీటికి అదనంగా మరికొన్ని క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ చెప్పారు. విద్యుదుత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. డ్యాంకున్న 20 క్రస్ట్ గేట్లలో 18 గేట్లను సోమవారం సాయంత్రానికి ఎత్తే అవకాశం ఉందని సూచన ప్రాయంగా చెప్పారు. కేఎల్‌రావ్ పులిచింతల జలాశయంలో పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు 3.38 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడకు 25,982 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇక్కడ నుంచి దిగువకు 3,275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయం త్వరలోనే నిండే అవకాశాలు ఉన్నాయి.


ఈపూరు ప్రాంతంలో నారు మళ్లు

### సాగునీటి విడుదలకు ఆదేశాలు..

సాగర్ కుడి కాల్వ ఆయకట్టు పరిధిలో సాగుకు నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం అధికారులను ఆదేశించారు. రైతులు నారుమళ్లు సాగు చేసుకునేందుకు ఏర్పాట్లు చేయలన్నారు.


నాగార్జున సాగర్ జలాశయం జలకళ

ఈ పరిస్థితుల్లో వరి సాగుకు ఈ ఏడాది పుష్కలంగా సాగు నీరు సరఫరా కానున్నది. ఆయకట్టులో అన్నదాతలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని 11.16 లక్షల ఎకరాలకు సాగు నీరు సరఫరా కానున్నది. దీంతో ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తీరనున్నాయి. సాగునీటి కొరతతో గత ఏడాది ఆయకట్టులో వరి సాగుకు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సాగర్ జలాశయానికి భారీగా వరద నీరు వస్తుండటంతో సాగుకు పుష్కలంగా నీరు అందుబాటులోకి వస్తోంది. ఖరీఫ్‌లో వరి సాగుకు నీరు ఇస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ప్రకటించారు. ఆశాభావంగా వర్షాలు, జలశయాలకు నీరు భారీగా వస్తుండటంతో ఇప్పటికే వరి నారుమళ్ల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే విస్తృతంగా రైతులు వరి నారు మళ్లు సాగు చేశారు. కాల్వకు నీరు విడుదల చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నాట్లు కూడా ప్రారంభంకానున్నాయి. పల్నాడు జిల్లాలో 5.71 లక్షల ఎకరాలు, గుంటూరు 95 వేల ఎకరాలు, బాపట్ల 1.88 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు పుష్కలంగా సరఫరా కానున్నది.


# తొలిగిన అడ్డంకి

- ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సిద్ధం
- ఈ నెల 6 నుంచి రాత పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు
- హైకోర్టులో రిట్‌ని ఉపసంహరించుకున్న పిటిషనర్లు

గుంటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో హైకోర్టు కేసు కారణంగా వాయిదాపడిన 20 పోస్టుల నియామక ప్రక్రియకు అడ్డంకులు తొలిగిపోయాయి. ఎవరైతే పిటిషన్ వేశారో వారు దానిని ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత దశలో ఎలాంటి అభ్యంతరాలు లేవు. దీంతో సత్వరమే ఆయా పోస్టులను భర్తీ చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహిం చేందుకు అధికార యంత్రాంగం తేదీలను ఖరారు చేసింది. నియామక ప్రక్రియలో గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది. లేకుంటే గతంలో వలే అనేక ఆరోపణలు, కోర్టు కేసులు దాఖలయ్యే అవకాశం లేకపోలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఖాళీల భర్తీకి గత సంవత్సరం నియామక ప్రక్రియ చేపట్టారు. అందులో 34 పోస్టుల నియామకాలను పూర్తి చేశారు. నియామక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. కాగా నోటిఫికేషన్‌లో 20 పోస్టులకు సంబంధించి హైకోర్టులో కేసు దాఖలు కావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే పిటిషనర్లు హైకోర్టులో రిట్‌ను ఉపసంహరించుకు న్నారు. ఈ క్రమంలో ఆయా పోస్టుల భర్తీకి అధికారులు సిద్ధమయ్యారు. దీంతో తొలుత రాత పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఒక డ్రెయిన్ క్లీనర్, రెండు గ్యాంగ్ మజ్దూర్, 12 పబ్లిక్ హెల్త్ వర్కర్, మూడు స్వీపర్, ఒక హోల్‌టైం సర్వెంట్, ఒక కలాసి పోస్టులున్నాయి. డ్రెయిన్ క్లీనర్ పోస్టుకి 86, గ్యాంగ్ మజ్దూర్ పోస్టులకు 385, పీహెచ్ వర్కర్ పోస్టులకు 2,840, స్వీపర్ పోస్టులకు 974, హోల్‌టైం సర్వెంట్‌కు 235, కలాసికి 596 దరఖాస్తులు అందాయి. అభ్యర్థులకు చదవడం, రాయడం పరీక్షను సిద్ధార్థనగర్‌లోని జేసీ కాలేజ్ ఆఫ్ లాలో నిర్వహించాలని నిర్ణయించారు. డ్రెయిన్ క్లీనర్ పోస్టు అభ్యర్థులకు ఈ నెల 6న ఉదయం 10.30కు, గ్యాంగ్ మజ్దూర్ పోస్టుల అభ్యర్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష నిర్వహిస్తారు. పీహెచ్ వర్కర్ పోస్టులకు అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉన్నందున వచ్చే బుధ, గురు, శుక్రవారాల్లో రోల్ నెంబర్ల వారీగా కేటాయించిన సమయాల్లో జరుగుతాయి. స్వీపర్ పోస్టు అభ్యర్థులకు ఈ నెల 12న, హోల్ టైం సర్వెంట్, కలాసి పోస్టుల అభ్యర్థులకు 13న పరీక్ష నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

# పునాదుల పటిష్టతపై పరిశీలన

**రాజధానిలో మద్రాసు ఐఐటీ నిపుణుల బృందం**



సచివాలయం భవనాల నిర్మాణ కాంక్రీట్ పౌండేషన్‌ను బోటులో వెళ్లి పరిశీలిస్తున్న మద్రాసు ఐఐటీ ఇంజనీరింగ్ బృందం



తుళ్లూరు, ఆగస్టు 3: రాజధాని అమరావతిలో వివిధ దశల్లో నిలిచిపోయిన పలు భవన నిర్మాణాల స్థితిగతులపై ఐఐటీ నిపుణుల బృందం అధ్యయనం కొనసాగుతోంది. తొలిరోజు ఐఐటీ హైదరాబాద్ బృందం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ ఉద్యోగులు, గ్రూప్- 1, 2, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించగా, రెండో రోజు శనివారం మద్రాస్ ఐఐటీకి చెందిన నిపుణుల బృందం కోర్ క్యాపిటల్లో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సచివాలయ, ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవన పునాదుల పటిష్టతను పరిశీలించింది. మద్రాస్ ఐఐటీ ఇంజనీరింగ్ విభాగాధిపతి మెహర్‌ప్రసాద్, కరోషన్ ఇంజనీర్ రాధాకృష్ణ పిళ్లై, సాయిల్ అండ్ ఫౌండేషన్ ఎక్స్‌పర్ట్ సుదీప్ బెనర్జీతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం నీటిలో నానుతున్న ఆయా పునాదులను పరిశీలించింది. వైసీపీ ప్రభుత్వం ఆయా పునాదులను నీటిలో నానబెట్టి ఐరన్ తుప్పుపట్టేలా చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కురిసిన వర్షాలకు అందులోకి భారీగా నీరు చేరగా ఎన్‌డీఆర్ఎఫ్ పడవలో నిపుణుల బృందం నీటిలో మునిగిన పునాదులు, కాంక్రీటు, ఇనుప చువ్వల పరిస్థితిని పరిశీలించింది. అనంతరం రాజధాని రోడ్లు, వాటికి అనుసంధానమై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జీలను కూడా పరిశీలించింది. ఈ బృందం వెంట జియో టెక్నికల్ ఎక్స్‌పర్ట్, సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్లు ధనుంజయ, శివప్రసాద్, గతంలో ఐకానిక్ భవనాల పౌండేషన్ పనులు చూసిన ఇంజనీర్ హేమంబర్‌రెడ్డి, ఎన్‌సీసీ, ఎల్ అండ్‌టీ, షపూర్జీ పల్లోంజీ కంపెనీల ఇంజనీర్లు, వారి ప్రతినిధులు ఉన్నారు.

# ఆగని దందా.. ఆపై ఆధిపత్య పోరు

- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు, రవాణా
- చీరాల, పందిళ్లపల్లిలో 125 పైగా అక్రమ క్వారీలు


కావూరివారిపాలెం శివార్లులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు(ఫైల్)

చీరాల, ఆగస్టు 3: ప్రభుత్వం మారింది. ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టారు. అయినా చీరాల పరిధిలో ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. ఇసుక అక్రమాలపై కలెక్టర్ వెంకట మురళి సోమవారం హెచ్చరికలు జారీ చేసినా అధికార యంత్రాంగంలో స్పందన లేదు. మండల స్థాయిలో కమిటీలు వేసి ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా కొనసాగించాలని కలెక్టర్ చెప్పినా అధికారులు నిర్లక్ష్యంగా ఉంటుండగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నా సెబ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. చీరాల నియోజక వర్గ పరిధిలో సుమారు 125కుపైగా అక్రమ ఇసుక క్వారీలు(పాతవి, కొత్తవి కలిపి) నడుస్తున్నాయి. చినగంజాం మండలంలో తాత్కాలికంగా ఆపగా చీరాల మండలం బోయినవారిపాలెం, కావూరివారిపాలెం, గవినివారిపాలెం, వేటపాలెం మండలం పందిళ్లపల్లి, పాపాయిపాలెం తదితర గ్రామాల పరిధిలో అనధికారిక క్వారీలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రస్తుతం అక్రమార్కుల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఈ క్రమంలో యంత్రాంగం సరైన రీతిలో తీగ లాగితే డొంక కదిలినట్లు ఇసుక తోడేళ్లు ఎవరనేది బహిర్గతయ్యే అవకాశం ఉంది.

### పాలక, ప్రతిపక్షాల నేతల హస్తం

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పలువురు పాలక, ప్రతిపక్షాల నేతల హస్తం ఉన్నందునే కలెక్టర్ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నట్లు తెలిసింది. వేటపాలెం మండలం సింగరాయకొండకు చెందిన టీడీపీ వ్యక్తి కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు, రవాణా సాగుతుంది. జనసేన పార్టీకి చెందిన ఓ నేత కనుసన్నల్లో ఓ క్వారీ నడుస్తోంది. ఓ మాజీ ప్రజాప్రతినిధి సోదరుడు కూడా ఓ క్వారీ నడుపుతున్నాడు. ఇక మిగిలిన వారు చిన్న, చిన్న క్వారీలు నడుపుతున్నారు. కలెక్టర్ ప్రత్యేకంగా అక్రమ తవ్వకాలపై దృష్టి సారించి లెక్కలు తీస్తే రూ.కోట్లలో ఆదాయం ఖజానాకు జమయ్యే అవకాశం ఉంది.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి రవికుమార్

# సత్వరమే విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వండి

● మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఆగస్టు 3 : వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు దరఖాస్తు చేసుకున్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో గ్రామాలవారీగా సమస్యలపై సమీక్ష నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విద్యుత్ కనెక్షన్ల కోసం రైతాంగం అందించిన దరఖాస్తులపై స్పందించిన మంత్రి కరెంట్ స్తంభాలు, కేబుల్, ట్రాన్స్‌ఫారమ్‌ల ఏర్పాటుకు ప్రత్యేక బృందాలతో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈ, డీఈలను ఆదేశించారు.

### సాగు నీరు, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

శ్రీశైలం డ్యామ్‌కు నీరు పూర్తి స్థాయిలో చేరిందని, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు నీటి చేరిక ఆశాజనకంగా ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించామన్నారు. డ్యామ్‌కు నీరు పూర్తిస్థాయిలో చేరిందని, ఈ ప్రాజెక్ట్ నుంచి నీటిని నాగార్జున సాగర్‌కు మళ్లిస్తున్నట్లు తెలిపారు. 7 టర్బైన్లు, 770 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు. శ్రీశైలం విద్యుత్ ప్రాజెక్ట్ ద్వారా విద్యుదుత్పత్తి ఆశాజనకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రాజెక్ట్ సందర్శించే నాటికి 98 మిలియన్ యూనిట్స్ ఉత్పత్తి జరిగిందని, నేటికీ విద్యుత్ ఉత్పాదన అవుతుందని తెలిపారు. జగన్‌రెడ్డి అనుసరించిన నాసిరకం విధానాల ద్వారా విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైందని మంత్రి పేర్కొన్నారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా వైసీపీ పాలకులు ప్రజలపై విద్యుత్ భారాలను మోపారన్నారు. విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడతామన్నారు. దేశస్థాయిలో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవాలు, ఆదేశాల మేరకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా విద్యుదుత్పాదన పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, మస్తాన్‌వలి, గుర్రం ఆదిశేఖర్, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, తొట్టెంపూడి చంద్రశేఖర్, నార్నె సుబ్బారావు, వరపర్ల సుబ్బారావు, గరిమిడి జగన్, బత్తుల వెంకటరావు, శింగరకొండ, చౌదరిబాబు, మేడ సుబ్బారావు, జార్లమూడి శ్రీనివాసరావు, అమృతపూడి ఏసోబు, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, గొట్టిపాటి కాజా, శింగర్, గొల్లపూడి అంజయ్య, శ్రీనివాసరావు, శ్రీను, పిచ్చిరెడ్డి, జక్రయ్య, హరిబాబు, ధూళిపాళ్ల రవి, శివరాజు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెచ్చిపోయిన జులాయిలు

● కూతురి జోలికి వెళ్లవద్దన్నాడని తండ్రిపై కత్తితో దాడి



దాడిలో గాయపడిన సత్యనారాయణ

మార్కాపురం, ఆగస్టు 3: మార్కాపురంలో జులాయిలు రెచ్చిపోయారు. తన కుమార్తె జోలికెళ్లొదని మందలించాడని మనసులో పెట్టుకున్న ఓ యువకుడు అతని సోదరునితో కలిసి వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు, స్థానిక పాండురంగస్వామి దేవస్థానం సమీపంలో నివాసముండే నాలి సత్యనారాయణ నెహ్రూబజార్‌లో సిమ్‌కార్డుల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన కుమార్తెను ఆవుల దుర్గాసాయి అనే యువకుడు కొంతకాలంగా వెంటపడి వేధింపులకు గురిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న సత్యనారాయణ పలుమార్లు మందలించాడు. మూడురోజుల క్రితం తమ ఇంటి పరిసరాల్లో తిరుగుతున్న దుర్గాసాయిని సత్యనారాయణ తీవ్రంగా హెచ్చరించాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకున్న దుర్గాసాయి అతని సోదరుడు భవానికి విషయం తెలియజేశాడు. కొండపిలో ఉంటున్న భవాని ఈ నెల 1న నెహ్రూబజార్‌లోని సత్యనారాయణ దుకాణం వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. తన తమ్ముడి జోలికొస్తే ప్రాణాలు తీస్తానని హెచ్చరించాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్లేందుకు ఓ ప్రింటింగ్ ప్రెస్ వద్దవున్న బైక్‌ను తెచ్చుకునేందుకు సత్యనారాయణ వెళ్లాడు. అక్కడ కాపుకాసిన ఆవుల దుర్గాసాయి, భవానీలు కత్తితో సత్యనారాయణ తలపై, వీపుపై కత్తితో దాడిచేసి పారిపోయారు. విషయం గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే సత్యనారాయణను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పట్టణ ఏఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# హాజరు నిబంధనలు పాటిస్తోంది 47 శాతం మంది టీచర్లే!

ఒంగోలు(విద్య), ఆగస్టు 3: ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరు విషయంలో పాఠశాల విద్యా కమిషనర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శనివారం ఆర్జేడీ, డీఈవోలు, ఎంఈవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరు విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. పాఠశాలల్లో టీచర్లు ముఖ ఆధారిత అటెండెన్స్‌లో 47.3శాతం మంది మాత్రమే సరైన సమయానికి లాగిన్, లాగౌట్ వేస్తున్నారని కుండబద్ధలు కొట్టారు. ఇకపై డీఈవోలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రతి ఒక్కరూ లాగిన్, లాగౌట్ టైం 100 శాతం ఖచ్చితంగా సరైన సమయంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరైన సమయంలో హాజరు నమోదు విషయంలో అలసత్వం వహిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# విద్యార్థినిని తల్లిని చేసిన ముగ్గురు అరెస్టు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 3: ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థినిని మోసం చేసి తల్లిని చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాలికను ప్రేమపేరుతో మోసం చేసి గర్భవతిని చేసిన పి.సైదుబాబు, అదేవిధంగా ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడిన ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్.వెంకటరెడ్డిలను చీమకుర్తి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. సైదుబాబు బాలికను ప్రేమించానని మాయమాటలు చెప్పి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేశాడు. అదేక్రమంలో డబ్బులు ఆశ చూపడంతో పాటు వారి ప్రేమ వ్యవహారాన్ని బట్టబయలు చేస్తానని బెదిరించి బాలికపై శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డిలు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ మేరకు ముగ్గురిపై గత నెల 31న చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డి.నీలిమా వంశీలతలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ప్రతికూలం

సాగు 16.80 శాతమే!

ఇప్పటికే సగం కాలం పూర్తి

కరుణించని వరుణుడు

ఆపై ఎండలు, గాలులు

మెట్ట సాగుకు

దాటుతున్న అదును

రైతుల ఆందోళన



కొండపి ప్రాంతంలో వాడిపోతున్న నువ్వుపైరు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా పడక ఇబ్బందికర పరిస్థితి నెలకొన్నాయి. జూన్ మాసం మొదట్లో కురిసిన వర్షాలతో రైతాంగం పొలాలను దున్ని సిద్ధం చేసుకున్నారు. కానీ తర్వాత సాధారణ వర్షపాతం కూడా కరవైంది. ఆగస్టు ప్రారంభమైన గతంతో పోల్చితే ఈ సంవత్సరం ఇంకా 16.8 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగు అయ్యాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. పైర్లు సాగు చేసుకునేందుకు రైతులు వరుణదేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమంది దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. మెట్ట ప్రాంతాల్లో సైతం ఎలాంటి పైర్లు సాగు చేయలేదు. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే నెలరోజులు గడచిపోవటంతో అదును దాటిపోతుందని అన్నదాతలు ఆందోళనలు చెందుతున్నారు.

● దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 60 శాతం భూములు ఖాళీగా ఉన్నాయి. అతి కొద్ది ప్రాంతాల్లో అక్కడక్కడ కంది, సజ్జ పైర్లు సాగు చేసినప్పటికీ ఇంకా మొలకెత్తలేదు. సాగర్ ఆయకట్టు భూముల్లో కూడా ఎలాంటి పైర్లు సాగుకు నోచుకోలేదు. ప్రతి సంవత్సరం కంది, సజ్జ, పెసర, మంచి శనగ పైర్లు సాగు చేసేవారు.

● కొండపి ప్రాంతంలో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే వర్షం కురవకపోవడం ప్రతిబంధకంగా మారింది. గత నెలలో కురిసిన అరకొర వర్షానికి రబీలో పొగాకు సాగు చేసి ఖాళీగా ఉన్న భూముల్లో రైతులు నువ్వు, జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకున్నారు. తిరిగి వర్షం పడకపోవడంతో ఎదురుచూస్తున్నారు. ఎర్రనేలల్లో ప్రస్తుతం వర్షం కురిస్తే కందితోపాటు అంతర పంటలుగా పశువుల మేతకోసం జొన్న, పిల్లిపెసర పంటలు సాగు చేస్తారు. ఈనేలల్లోని రైతులు పొలాలకు పశువుల ఎరువును తోలుతున్నారు.

● మార్కాపురం డివిజన్ పరిధిలో వరుణుడి కరుణలేక ఖరీఫ్ సాగు కదలడం లేదు. కంది, పత్తి పంటలు ఈపాటికే సాగు కావాల్సి ఉంది. కానీ లోటు వర్షపాతంతో సాగుకు అవాంతరం ఏర్పడింది. మిరప, పొగాకు వేసేందుకు ఈ సంవత్సరం ఎక్కువమంది రైతులు మొగ్గుచూపుతున్నారు. గత నెలలో సాధారణ వర్షపాతం నమోదైనా ఖరీఫ్ సాగు ఊపందుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల పరిధిలో 79,103 హెక్టార్లలో పంటలు సాగుకావాల్సి ఉండగా ప్రస్తుతం 3,259 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులో ఉన్నాయి.

ఒంగోలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి)/మార్కాపురం/కొండపి/దర్శి : జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రతికూలంగానే సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా కనీసం 20శాతం విస్తీర్ణంలో కూడా పంటలు సాగుకాలేదు. ఆశించిన రీతిలో జిల్లాపై వరుణుడు కరుణించక సాగు జాప్యం కాగా తాజాగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరగడమే కాక గాలుల తీవ్రత కూడా ఉండటం రైతులను కలవరపెడుతోంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటివరకు కేవలం 16.80 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగు కాగా ఇదే వాతావరణ పరిస్థితులు మరో వారం పది రోజులు కొనసాగితే మెట్టపైర్ల సాగుకు అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

### ఖరీఫ్ రెండు నెలలు పూర్తి

జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ కాలం. ఈ సీజన్‌లో 2.02 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా కంది, పత్తి, మిర్చి, సజ్జ వంటి పంటలు ప్రధానంగా సాగుచేస్తారు. అందులో పూర్తిగా వర్షాధారంగా సాగు చేసే కంది, పత్తి పంటలే దాదాపు లక్షా 5వేల హెక్టార్లలో సాగవుతాయి. ఆ రెండు పంటలలో అత్యధిక శాతం ఈ సమయానికే విత్తనాలు వేసి పైరు ఎదుగుదలలో ఉండాలి. ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో నెలరోజులు పైరుగా ఉండాలి. అయితే వర్షాలు సరిలేక అధికశాతం భూముల్లో విత్తనాలు పడలేదు. నిజానికి జిల్లాలో మే ఆఖరులో అడపాదడపా పడే జల్లులతోటే తొలకరి పైర్లుగా పిలుచుకునే నువ్వు, సజ్జ, పెసరలతోపాటు పశుగ్రాసం, పచ్చిరొట్టలను సాగుచేస్తారు. జూన్ రెండవపక్షం నుంచి ప్రధాన పంటలు వేస్తారు. అలాంటిది ఈ ఏడాది వరుణుడు కరుణ ఆశించినంతగా లభించలేదు, జూన్‌లో మంచివర్షాలే కురిసినా ఆ వర్షాలతో దుక్కులు దున్ని విత్తేందుకు భూములను సిద్ధం చేసిన రైతులకు జూలైలో నెలకొన్న వర్షాభావం దెబ్బతీసింది.

### 34వేల హెక్టార్లలోనే విత్తనాలు

జూన్‌లో 57.9మి.మీ. సాధారణ వర్షపాతానికి సుమారు 44.7శాతం అధికంతో ఇంచుమించు 83.8 మి.మీ వర్షం కురిసింది. దీంతో కొన్నిచోట్ల పైర్లు వేసిన రైతులు అత్యధిక ప్రాంతాల్లో తదుపరి సాగుకు భూములు సిద్ధం చేశారు. అయితే అనంతరం జూలైలో 87.9 మి.మీ సాధారణ వర్షపాతానికి 82.8 మి.మీ మాత్రమే కురిసింది. అది కూడా ఒకటి, రెండు విడతలుగా కాకుండా అప్పుడు కాస్త, అప్పుడు కాస్త పడటంతో సాగుకు పెద్దగా పనికిరాలేదు. దీంతో అధికశాతం భూముల్లో విత్తనాలు పడలేదు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.02లక్షల హెక్టార్లుకాగా ఈ సమయానికి కనీసం 70వేల నుంచి 75వేల హెక్టార్లలో పంటలు సాగు కావాలి. అయితే కేవలం 34వేల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు పడ్డాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో 16.80శాతంలోనే పైర్లు వేశారు. దాదాపు 73వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో ఖరీఫ్‌లో కంది సాగు చేస్తారు. ఈ సమయానికి 40 వేల నుంచి 45వేల హెక్టార్లలో వేస్తారు. అలాంటిది ప్రస్తుతం 9,800 హెక్టార్లలో మాత్రమే విత్తనం వేశారు.

### ఎండుతున్న పైర్లు

మరో ప్రధానమైన పత్తి పంట చూస్తే 31,582 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం కాగా ఈ సమయానికి 15వేల నుంచి 20వేల హెక్టార్లలో విత్తనాలు వేస్తారు. అలాంటిది 6,321 హెక్టార్లలో మాత్రమే వేయగలిగారు. దాదాపు 24వేల హెక్టార్లలో మిర్చి సాగు చేయాల్సి ఉండగా కేవలం 350 హెక్టార్లలోపు మాత్రమే సాగు జరిగింది. తొలకరి పైర్లు 12వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా అందులో సగం విస్తీర్ణంలో మాత్రమే వేశారు. అవి కూడా వర్షాభావం, ఎండల తీవ్రతతో ఎండిపోతున్నాయి. సాగు చేసిన ఇతర పైర్లను ప్రస్తుతం వాతావరణం దెబ్బతీస్తోంది. ఉపకరించే స్థాయి వర్షాలు కురవకపోగా సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఆపై వడగాలులు పైర్లను దెబ్బస్తున్నాయి. కొన్నిచోట్ల ఆ పైర్లు వాడుముఖం కూడా పట్టాయి. ఇప్పటికైనా వర్షాలు పడితే ఆలస్యంగానైనా సాగుకు అవకాశం ఉందని లేక ఇదే వాతావరణ పరిస్థితి కొనసాగితే మెట్ట సాగుకు అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఏం చర్యల్లేవ్ !

అసైన్డ్ భూముల్లో వెంచర్లు..

ఆపై భవంతులు..!

చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

వైసీపీ నేతల అక్రమాలపై చర్యలు శూన్యం

నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయం



పామూరు రోడ్డులోని అసైన్డ్‌భూమిలో అక్రమంగా వైసీపీ సర్పంచ్ నిర్మించిన భారీ భవంతి

కనిగిరి, ఆగస్టు 3: ప్రభుత్వం మారినా వైసీపీ నేతలపై అధికారుల్లో మాత్రం విశ్వాసం ఇంకా కొనసాగుతుందని ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కనిగిరి ప్రాంతంలో కొనసాగుతున్న భూఅక్రమాలే నిదర్శనం. నిరుపేదలకు భూమిని కేటాయించి వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుని అభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే, ఆ భూముల్లో వెంచర్లు వేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ద్వారా అసైన్డ్ భూములు కేటాయించిన వారి వారసులు వ్యవసాయం చేసుకోవాల్సింది పోయి వాటిని అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకొందరైతే ఏకంగా అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేసి నిబంధనలకు పాతరేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికార యంత్రాంగం వారి వద్ద ముడుపులు పుచ్చుకుని పట్టించుకోకుండా వదిలేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### నీరుగారుతున్న ప్రభుత్వ ఉద్దేశం

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 250 ఎకరాల్లో ప్రభుత్వ, అసైన్డ్, పశువుల బీడు, పోరంబోకు భూముల్లో అక్రమంగా వెంచర్లు వెలిశాయి. దారిద్ర్యరేఖకు దిగువను ఉన్న పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు ప్రస్తుతం అన్యాక్రాంతమయ్యాయి. భూముల ధరలకు రెక్కలు రావటంతో ఆ భూములు కూడా వెంచర్లుగా మారిపోయాయి. కొంతమంది భూయజమానులు ప్లాట్లుగా కొంత భూమిని విక్రయించి ఆ సొమ్ముతో మిగతా భూమిలో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు.

### వ్యవసాయం వదిలేసి వెంచర్లు

కనిగిరి పట్టణ పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం ఎదురు వ్యవసాయ భూముల్లో వేసిన వెంచర్లలో ఉన్న ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించి 615/2 సెటిల్‌మెంట్ సర్వే నెంబరును చూపించి ఎడవల్లి గ్రామ వైసీపీ సర్పంచ్ కాసుల గురవయ్య భారీ భవంతిని నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే, పట్టణ సమీపంలోని కందుకూరు రోడ్డులోని పేరంగుడిపల్లి గ్రామ పరిధిలో ఉన్న 26 సర్వే నెంబరులోని ఇండ్ల వినయ్‌కుమార్ అనే వ్యక్తి తన పేర ఉన్న 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయించటమే కాకుండా భారీ భవంతిని నిర్మించారు. ప్రభుత్వం వ్యవసాయం చేసుకుని జీవించేందుకు కేటాయించిన భూమిని అక్రమంగా వెంచర్ వేయటమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. వీటిపై 2015, 2020లో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేసినప్పటికి వాటిని ఖాతరు చేయలేదు. పైగా వాటి నిర్మాణాలకు అనుమతులు మంజూరుచేయటం వెనుక అధికారులు వారిచ్చే తాయిలాలు పుచ్చుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా వేసిన వెంచర్లలోని భారీ భవంతులకు అనుమతులు, ఆ భవంతులు ఏ సర్వే నెంబరులో నిర్మించారో ఉన్నాయో, లేదో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

# డెంగ్యూతో బాలుడి మృతి

కంభం, ఆగస్టు 3 : డెంగ్యూ జ్వరంతో బాలుడు మృతిచెందిన ఘటన శనివారం కంభం పట్టణంలోని అమ్మవారిశాల సమీపంలో చోటుచేసుకొంది. పట్టణంలోని ఆలంపల్లి భరద్వాజ్(14) నాలుగు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించ చికిత్స అందిస్తున్నారు. అయితే బాలుడికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలుడి తండ్రి సుబ్బరాజు నీరసంతో పడిపోయారు. దీంతో తిరిగి కంభం వచ్చి మరో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. తండ్రి కోలుకోగా, చికిత్స పొందుతూ శనివారం బాలుడు మృతి చెందాడు. భరద్వాజ్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువు తున్నాడు. కందులాపురంలోనూ ఓ వృద్ధుడికి డెంగ్యూ జ్వరం రావడంతో గుంటూరుకు తరలించినట్లు తెలిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల నీరు నిలిచి దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో డెంగ్యూ వ్యాప్తి చెందుతోంది.



ఆలంపల్లి భరద్వాజ్ (14) ఫైల్

# 40 వేల మందికి ఇంటర్ పాఠ్యపుస్తకాలు

అద్దంకిటౌన్, ఆగస్టు 3 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను అందిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు అన్నారు. శనివారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రాజేశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్‌జేడీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మంది ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం చరిత్రలో శుభపరిణామని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పణీంద్రబాబు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డాక్టర్ కె.సుధాకర్, 11వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుభాషిణి సాంబశివరావు, టీడీపీ నాయకులు కాకాని అశోక్, వడ్లవల్లి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

# రెండు రేషన్‌షాపులపై కేసు

అద్దంకి, ఆగస్టు 3 : అద్దంకి పట్టణంలో రెండు రేషన్‌షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావు తెలిపారు. శనివారం పట్టణంలోని వాసవీనగర్‌లో షాపు నెంబరు 50లో తనిఖీలు చేయగా 4.50 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాస్యం ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. స్టాకును వీఆర్వోకు అప్పగించారు. ఐదు రోజుల కిందట పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో షాపు నెంబరు 46ని బినామీ డీలర్ నిర్వహించడంతో పాటు, 4 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావు తెలిపారు.

# జువైనల్ కోర్టుకు బాలిక ప్రసవం నివేదిక

ఒంగోలు(విద్య), ఆగస్టు 3: కొత్తపట్నం మండలం మోటుమాల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని మరుగుదొడ్డిలో ప్రసవించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే కేజీబీవీ ప్రత్యేక అధికారి వి.అరుణకుమారి, ఏఎన్ఎం జే.సత్యవతిలను కలెక్టర్ నోట్ ఉత్తర్వుల మేరకు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, డీఈవో డి.సుభద్ర ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర పథకం సంచాలకులకు డీఈవో సమగ్ర నివేదికను పంపారు. కేజీబీవీలో బాలిక ప్రసవంపై మీడియాలో వచ్చిన కథనాలపై జువైనల్ జస్టిస్ కోర్టు సమగ్ర శిక్ష అధికారులకు నోటీసులు జారీచేసింది. బాలికలపై అఘాయిత్యాలు జరిగినా, అన్యాయం జరిగినా ఈ కోర్టు స్పందించి సుమోటాగా కేసును స్వీకరిస్తుంది. జువైనల్ నోటీసుల నేపథ్యంలో డీఈవో సుభద్ర వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై ఈ సంఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను, దీనిపై తీసుకున్న చర్యలను వివరిస్తూ నివేదికను సమర్పించారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్సపొందుతున్న బాలికను శనివారం డీఈవో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

# కందుల రత్నంకు డాక్టరేట్

మేదరమెట్ల, ఆగస్టు 3 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ అంబేడ్కర్ చైర్‌లో పరిశోధన చేసినందుకు కందుల రత్నంకు పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. మేదరమెట్లకు చెందిన కందుల రత్నం ఇంపాక్ట్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఆన్ లివింగ్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్ ఏ కేస్ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. డాక్టర్ కె.సోమశేఖర్ పరిశోధనా పర్యవేక్షణలో జరిగిన ఈ పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సుధాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన కందుల రత్నంకు విభాగాధిపతి ఆచార్య వై.అశోక్‌కుమార్, అధ్యాపకులు, సహచర పరిశోధకులు అభినందనలు తెలిపారు.

# పేరు గొప్ప.. ఊరు దిబ్బ

### జగనన్న కాలనీల దుస్థితి



పాతచీరాల పరిధిలో వివిధ దశల్లో ఉన్న జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు



వర్షపు నీటితో చిత్తడిగా మారిన కాలనీలో రోడ్డు

చీరాల, ఆగస్టు 3 : వైసీపీ పాలనలో పేద ప్రజల కోసం చేపట్టిన జగనన్న కాలనీలు పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో 3,144 మందికి వారికి కేటాయించిన ప్రభుత్వ స్థలాల్లో గృహ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వాటిలో 2,321 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. అందులో కూడా నివాసాలు ఉంటున్న వారి సంఖ్య సగానికి సగమే ఉండటం విశేషం. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. 12 మంది అసలు పనులే మొదలు పెట్టలేదు. పాత చీరాల లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికి ఒక్కరు కూడా అక్కడ గృహ ప్రవేశాలు చేయలేదు. అక్కడ నివేశన స్థలాలకు సంబంధించి స్థల సేకరణలో సంబంధిత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ ధర కన్నా అదనపు ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం మీద ప్రచార ఆర్భాటమే కాని లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనం నామమాత్రం కూడా లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

# గుండ్లకమ్మపై వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

- నీరు లేకుండా బీడు భూములను తలపించేలా రిజర్వాయర్ ప్రాంతం
- దశాబ్ద కాలం తరువాత పలు గ్రామాల నుంచి నది గుండా రాకపోకలు
- 15 ఏళ్లలో ఎన్నడూ లేని దుస్థితి



మణికేశ్వరం వద్ద బీడు భూములను తలపించేలా ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాంతం

అద్దంకి, ఆగస్టు 3 : వైసీపీ పాలకుల నిర్లక్ష్యం గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 2003లో గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగగా 2008లో ప్రారంభించారు. అప్పటి నుంచి గత 15 సంవత్సరాలుగా ఎన్నడూలేని విధంగా ప్రస్తుతం గుండ్లకమ్మ రిజర్వాయర్ దుస్థితి ఉంది. రెండేళ్ల కిందట గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు వరద నీటికి కొట్టుకు పోవడంతో అనంతరం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ ఉండకుండా సముద్రం పాలవుతోంది. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గతంలో ఎన్నడూ చూడని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్‌లో డ్యామ్ వద్ద నుంచి అద్దంకి పట్టణం సమీపం వరకు ఎప్పుడు ఎంతో కొంత నీరు నిల్వ ఉండేది. దీంతో గుండ్లకమ్మ అవతలి గ్రామాల నుంచి నదిలో గుండా రాకపోకలకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. అద్దంకి పట్టణం నుంచి తిమ్మాయపాలెం, వేలమూరిపాడు-కొటికలపూడి, తిమ్మారెడ్డిపాలెం-మణికేశ్వరం మధ్య గుండ్లకమ్మ నదిలో నీరు లేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నడిచి, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతం బీడు పొలాలను తలపించేలా దర్శనమిస్తుంది.

2018లో కరువు పరిస్థితులలో కూడా ఇలాంటి స్థితిలో గుండ్లకమ్మ రిజర్వాయర్ లేదని, ఇది వైసీపీ నేతల నిర్లక్ష్యానికి సాక్ష్యమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయకట్టు రైతులకు సాగు నీటి సరఫరా లేకపోగా గుండ్లకమ్మ రిజర్వాయర్ ఆధారంగా చేపల వేట సాగించే సుమారు 2వేల కుటుంబాలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ లో నీరు నిల్వ లేకపోవడంతో ఎన్నికల వరకు వైసీపీ నాయకులకు ఇసుక తరలింపు ద్వారా కాసుల పంట కురిపించిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఇసుక తవ్వకాల కోసమే రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గేట్ల మరమ్మతులు జరిగి రిజర్వాయర్‌లో నీటి నిల్వలకు అవకాశం కలుగుతుందని ప్రజలు, రైతులు, జాలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఔషధ మొక్కలను నాటుతున్న ఎంఈవో సుధాకరరావు

## ఔషధ మొక్కల పెంపకం అభినందనీయం

అద్దంకిటౌన్, ఆగస్టు 3 : రాబోయే అనారోగ్య విపత్తులను ఎదుర్కొనేందుకు ఐఈఈఆర్‌డీ సంస్థ పాఠశాలలో ఉచితంగా ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఎంఈవో-2 బీ సుధాకరరావు అన్నారు. ఐఈఈఆర్‌డీ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఔషధ మొక్కల బోర్డు ఆ యూష్ శాఖ సహకారంతో శనివారం అద్దంకిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మండలంలోని ధర్మవరం, శంఖరప్పాడు, కలవకూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నేటి సమాజంలో ఔషధ మొక్కలపై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అందరూ మొక్కలు నాటేలా చేయడమే ఐఈఈఆర్‌డీ లక్ష్యం అని సంస్థ అధ్యక్షుడు బి.కిరణ్‌చంద్ అన్నారు. వేప, తులసి, అశ్వగంధ, ఉసిరి, అలోవెరా తదితర ఔషధ మొక్కలను నాటారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ వి.దుర్గాగాయత్రి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు టి.శంకర్, ఎం.రమేష్, సంస్థ సభ్యులు వికాష్, రాంబాబు పాల్గొన్నారు.

## రాతి ముఖ మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, ఆగస్టు 3 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండప నిర్మాణానికి ఇనిమెర్లకు చెందిన సిద్ధమూర్తి నరసారెడ్డి, కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం కుమారులు మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

## వరద బాధితులకు సాయం అందించాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 3 : కేరళ రాష్ట్రంలోని వైనాడు వరద బాధిలకు కోసం ప్రజలందరూ తమ వంతుగా సాయం అందించాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య కోరారు. శనివారం పట్టణంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షాపులు, చీరల వ్యాపారులు తదితరుల వద్ద నుంచి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, కె.రఘుచంద్, పి.తిరుపతిరెడ్డి, బి.విజయకుమార్, పోనకా రామాంజనేయులు, కె.ప్రమీళ, రావులపల్లి కోటేశ్వరరావు, కె. హనుమంతరావు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి తిమ్మాయపాలెం విద్యార్థినులు



వెన్నెల హేమలత

అద్దంకిటౌన్, ఆగస్టు 3 : మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదివ తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినులు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం గంగాధరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పిల్లిమిట్ల వెన్నెల, సందిరెడ్డి హేమలతను ఎంఈవో డీ గంగాధరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## ఈ-పంటలో పైర్ల వివరాలు నమోదు చేయాలి

మార్టూరు, ఆగస్టు 3 : రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఈ పంట ద్వారా నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన అన్ని పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేయాలన్నారు. పంటల నమోదు కోసం ప్రభుత్వం ఈ-పంట మొబైల్ అప్లికేషన్ తీసుకువచ్చిందన్నారు. రైతుల పంటల నమోదులో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ పంట ఆధారంగా ప్రభుత్వం అందించే అన్ని పథకాలకూ అనుసంధానంగా ఉన్నాయన్నారు. రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు, సున్నావడ్డీ, పంట రుణాలు వంటి పథకాలు ఈ పంట ద్వారా వర్తిస్తాయన్నారు. అనంతరం జిల్లా మాస్టర్ ట్రైనర్ మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ పంట నమోదు చేయడం కోసం వచ్చే మొబైల్ అప్లికేషన్ గురించి వివరించారు. పంట నమోదులో అంతర పంటలు,మిశ్రమ పంటలను నమోదు చేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివ రించారు. తరువాత పొలంబడి కార్యక్రమం, వివిధ పపథకాల గురించి బల్లికురవ ఏవో కుమారి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు లావణ్య, సుబ్బారెడ్డి, ఉద్యాన అధికారి హనుమంతనాయక్‌తో పాటు రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు

# పంద్రాగస్టుకు అన్న క్యాంటీన్

- ఐదేళ్ల తర్వాత తెరుచుకోనున్న వైనం
- రూ.10లక్షలతో మరమ్మతులు




అద్దంకిలో సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్

అద్దంకి, ఆగస్టు 3 : పేద ప్రజల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి ప్రారంభం కానుంది. జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను మూసివేయించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల నుంచి మూతపడిన అన్న క్యాంటీన్ భవనాన్ని రూ.10 లక్షలతో మరమ్మతులు చేయించి సిద్ధం చేశారు. అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డు వెంబడి ఎన్‌ఎస్‌పీ కాలనీ వద్ద గత తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించి పేదలకు రూ.5కే అన్నం పెట్టేది. వైసీపీ రాగానే ఇక్కడి అన్న క్యాంటీన్‌ను మూసివేయించి జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా పునఃప్రారంభిస్తున్నారు. పం ద్రాగస్టు నుంచి క్యాంటీన్‌లు అందుబాటులో రానున్నాయి. అద్దంకిలోని అన్న క్యాంటీన్‌ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించేందుకు మునిసిపల్ అధికారులు సిద్ధం చేశారు. భవనానికి మరమ్మతులు, పెయింటింగ్, ఫ్లోరింగ్‌తో పాటు మహిళా మార్ట్ ఏర్పాటు సమయంలో తొలగించిన కిచెన్ నిర్మాణం, ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్నం పెట్టే అన్న క్యాంటీన్ మళ్లీ తెరుచుకోవడంపై పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

## సీఎంసీ ఎన్నికలు వివాదం లేకుండా జరపాలి

బల్లికురవ, ఆగస్టు 3 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను వివాదాలు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్ కోరారు. శనివారం బల్లకురవ విద్యా వనరుల కేంద్రంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఈ నెల 8న జరగనున్న ఎన్నికలకు తల్లిదండ్రులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులుగా ఎన్నుకోవాలన్నారు. ఎన్నికలలో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. గ్రామంలో దండోరా వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీచరణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

## ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి

### తహసీల్దార్‌కు టీడీపీ నేతల విజ్ఞప్తి

అద్దంకి, ఆగస్టు 3 : ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ శ్రీచరణ్‌ను టీడీపీ నేతలు కోరారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీచరణ్‌ను శనివారం అద్దంకి పట్టణ టీడీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, దొప్పలపూడి ప్రసాద్, బిళ్లపాటి రామాంజనేయులు, బొజ్జ విజయ్, బౌజంకు నాగరాజు, అత్తులూరి రమేష్, మాగులూరి గోపి, షేక్ వలి, కడియం శ్రీనివాసరావు,షేక్ అంజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

# 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మేదరమెట్ల , ఆగస్టు 3 : కిరణ్ జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున రోగులు పోటెత్తారు. శనివారం దైవాలరావూరులో జరిగిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో రోగులను డాక్టర్ మురళీకృష్ణ పరీక్షలు చేశారు. స్వగ్రామంలో అప్పుడప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించే వారు. కొరిశపాడు, జె.పంగులూరు, అద్దంకి తదితర ప్రాంతాల నుంచి సుమారు 500 మందికి పైగానే రోగుల వచ్చారు. వారందరినీ డాక్టర్ మురళీకృష్ణ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను అందజేశారు. దైవాలరావూరుకు చెందిన వ్యాపారవేత్త దేసు శివ, రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కిరణ్ జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్, మాజీ సర్పంచ్ చెన్నుపాటి హరిబాబు తదితరులు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఉదయం నుంచి తీరిక లేకుండా మురళీకృష్ణ రోగులను పరీక్షించారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రజలు ఎంతో వ్యవప్రయాసలు కోర్చి తిరుపతి మురళీకృష్ణ వద్దకు వెళ్లి వైద్య సేవలు పొందేవారు. ఆయన ఇక్కడకు రావడంతో వైద్య పరీక్షల కోసం ఆయన వద్దకు రోగులు క్యూ కట్టారు.



దైవాలరావూరులో రోగులను పరీక్షిస్తున్న శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళికృష్ణ

# తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం



తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

పేరాల(చీరాలటౌన్), ఆగస్టు 3 : పిల్లలకు తల్లి ముర్రిపాలతో ఆరోగ్యంతోపాటు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని సెక్టార్ సూపర్‌వైజర్ గ్లోరీ తబిత అన్నారు. పేరాల ఆనందపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల పాటు కచ్చితంగా తల్లిపాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లిల్లీ గ్రేస్, అంగన్వాడీ టీచర్ రేఖ ఎలిజబెత్, సులోచన, లత, సంధ్య, అనిత, ఉమ, అంగన్వాడీలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చినగంజాం : తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠమని, వాటి ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌వీ ఉల్లారాణి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలోని 125వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డలకు ఆరునెలల వరకు తల్లి పాలు తప్పకుండా ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఉల్లారాణి అన్నారు. తల్లి ఇచ్చే ముర్రు పాలలో అనేక పోషకాలు ఉండడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని గర్భిణులు, బాలింతలకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. నా బిడ్డకు ఉత్తమమైన పాలు, తల్లి పాలు ఇస్తానని తల్లులు, గర్భిణులు, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.విజయలక్ష్మి, ఏ సుజాత, బీ లక్ష్మి, సుబ్బమ్మ, ఏఎన్ఎం సువార్త, ఆశా కార్యకర్త కే.రోహిణి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



చినగంజాంలో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారులు ప్రశాంతి, శాంతి

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

### సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు, ఆగస్టు 3 : పరిశరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని సీనియర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం చెరుకూరు ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది నేతృత్వంలో పర్చూరు ఇందిరా కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.శాంతి ప్రారంభించారు. రోగులకు మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది శాంతి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల సీజనల్‌లో వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ ఏకాంబరేశ్వర రావు, డాక్టర్ గౌతమ్ రోగులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతమైన జీవితానికి తీసుకోవాల్సిన జాగ్రతలపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణి, న్యాయవాదులు పూరిమెట్ల జాన్, కరి ప్రవీణ్, కొమ్మాలపాటి రవి కుమార్ ఆరోగ్య సిబ్బంది రావి వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గౌస్, సర్పంచ్ మల్లా అంజమ్మ, సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ అదాలత్

బల్లికురవ, ఆగస్టు 3 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసిన రైతుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అదాలత్ కార్యక్రమం బల్లికురవ విద్యుత్ కార్యాలయంలో జరుగుతుందని మార్టూరు సబ్ డీవిజన్ డీఈఈ ఎం. సురేంద్రబాబు తెలిపారు. మండలంలో అత్యధిక శాతం రైతులు వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తులు పెట్టి ఉన్నారని వారు పెట్టిన అర్జీలు ఏ దశలో ఉన్నాయి వారికి ఎప్పుడు లైన్ ఏర్పాటు చేస్తారన్న వివరాలు తెలియజేసేందుకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అద్దంకి ఈఈ మస్తాన్‌రావు హాజరవుతున్నారని, ఎవరైనా సమస్యలు చెప్పుకోవాలని కోరారు.

## రాయితీతో మూడు కలెక్షన్ సెంటర్లు మంజూరు



కలెక్షను సెంటర్ గోడౌన్‌లో మొక్కజొన్న విత్తనాలు (ఫైల్)

మార్టూరు, ఆగస్టు 3 : ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మార్టూరు, బల్లికురవ,సంతమాగులూరు మండలాల పరిధిలో మూడు కలెక్షను సెంటర్లు మంజూరయ్యాయని ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. అయితే కోరుకున్న రైతులకు అవసరమైతే మూడు కలెక్షన్ సెంటర్లను ఒక మండలంలోనే మంజూరు చేస్తామన్నారు. అందుకు సంబంధించిన వివరాలను ఆయన తెలిపారు. రైతులు తమ పంట ఉత్పత్తులను సరైన ధర లేకపోవడంతో వాటిని తాత్కాలికంగా కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో రైతుల పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేలా గోడౌన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీతో రైతులకు కలెక్షను సెంటర్లు పేరుతో మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో రైతు సంఘాలు గ్రూపులకు, ఆ సభ్యులకు మాత్రమే 75 శాతం రాయితీతో సెంటర్లు మంజూరు చేసేవారని, ప్రస్తుతం రైతు సంఘాల గ్రూపులతో సంబంధం లేకుండా రైతులకు వ్యక్తిగతంగా మంజూరుచేస్తామని హనుమంతనాయక్ తెలిపారు. వాటి నిర్మాణానికి రూ.15లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో 40 శాతం రాయితీ అంటే రూ.6లక్షలు రైతుకు రావడంతో మిగిలిన రూ.9 లక్షలు మాత్రమే ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలని సూచించారు.

## ఉపాధి హామీ నిధులు మంజూరు

మార్టూరు, ఆగస్టు 3 : మండలంలోని వివిధ గ్రామాలకు 2024-25 సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.4.95 కోట్లు మంజూరైనట్లు పీఆర్ ఏఈ సుబ్బరాయశాస్త్రి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో గ్రామాలలో సైడు కాల్వలు, సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టవచ్చునన్నారు. గ్రామాలవారీగా నిధులు మంజూరు వివరాలను తెలియ చేశారు. మండలంలో మార్టూరు గ్రామానికి రూ.కోటి, వలపర్లకు రూ.60లక్షలు, తాటివారిపాలెంకు రూ.15లక్షలు, బొల్లాపల్లికి రూ.20 లక్షలు, లక్కవరం రూ.10లక్షలు, కోలలపూడి రూ.30లక్షలు, కోనంకి గ్రామానికి రూ.30లక్షలు, జొన్నతాళికి రూ.30లక్షలు, చిమ్మిరిబండకు రూ.20లక్షలు, ఇసుకదర్శి రూ.35లక్షలు, ద్రోణాదులకు రూ.45లక్షలు, బొబ్బేపల్లికి రూ.20లక్షలు, రాజుపాలెంకు రూ.20లక్షలు, రాజుగారిపాలెంకు రూ.15 లక్షలు, దేగరమూడికి రూ.10లక్షలు, నాగరాజుపల్లి గ్రామానికి రూ.35లక్షలు మంజూరయ్యాయి.

## వాహనం ఢీకొని ఐదు గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

మార్టూరు, ఆగస్టు 3 : రోడ్డు దాటుతున్న గొర్రెల మందను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఐదు గొర్రెలు చనిపోయిన సంఘటన శనివారం జాతీయ రహదారిపై యలవర్తి కోల్డ్‌స్టోరేజీ సమీపంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా నుంచి గొర్రెలమందను మేపుకుంటూ నలుగురు వ్యక్తులు ఒంగోలు వైపు వెళుతున్నారు. వారు ఉదయం చిలకలూరిపేట నుంచి మార్టూరు వస్తూ గుంటూరు వైపు వెళ్లేందుకు గొర్రెలమందతో రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో మార్టూరు వైపు నుంచి చిలక లూరిపేట వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 3 పెద్ద గొర్రెలు, రెండు చిన్న గొర్రెలు చనిపోయాయి. వాటి విలువ రూ.60వేలకు పైగా ఉంటుందని కాపరి పూసలపాడు రాజేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. మందను ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది.


## రైలు ఇంజన్‌పై ప్రయాణించిన యువకుడు

### విచారించి విడిచి పెట్టిన రైల్వే అధికారులు

చీరాలటౌన్, ఆగస్టు 3 : మతిస్థిమితం సరిలేని యువకుడు రైలు ఇంజన్ పైకి ఎక్కి ప్రయాణించాడు. ఈ ఘటన శనివారం చీరాలలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే ఉదయం చీరాలలో సింహపురి రైలు వచ్చి ప్లాట్‌ఫాంపై ఆగి కొద్దిసేపటికి బయలుదేరింది. అయితే వేదుళ్లపల్లి రైల్వే సిబ్బంది రైలు ఇంజన్‌పై యువకుడు ఉన్నట్లు గుర్తించి బాపట్ల రైల్వే సిబ్బదికి సమాచారం అందించారు. దీంతో అధికారులు బాపట్లలో రైలును ఆపి యువకుడిని కిందికి దింపి అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడికి మతిస్థిమితం సరిగాలేదని గ్రహించి జాగ్రత్తలు చెప్పి వదిలేశారు.



రైలు పైనుంచి యువకుడిని కిందికి దింపుతున్న రైల్వే సిబ్బంది



## కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా కబర్ది

నెల్లూరు (లీగల్), ఆగస్టు 3 : కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా నెల్లూరు ఒకటవ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న జీ.కబర్దికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పదోన్నతి కల్పించింది. ఆ మేరకు ఆయన్ను బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు శనివారం జిల్లా కేంద్రానికి చేరాయి. ఇప్పటివరకు కబర్ది చూస్తున్న బాధ్యతలను నెల్లూరు ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయాధికారికి అప్పగించాలని హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొంది.

# ఏం బావా.. వస్తావా!?

• నీక్కావలసింది.. నా దగ్గర ఉందంటూ హొయలు • నెల్లూరు నడిబొడ్డున వేశ్యలు, హిజ్రాల ఆగడాలు • రెడ్‌లైట్ ఏరియాగా విజయమహల్ గేటు రైల్వేకట్ట ప్రాంతం • అన్నీ తెలిసినా కునుకు వీడని పోలీసులు • ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజానీకం






ఇదీ నారేటు వస్తే రా!?



ఏయ్.. వస్తారా!?

అనారోగ్యంతో ఉన్న బిడ్డను బృందావనంలోని ఓ ఆసుపత్రిలో చూపించి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆటో కోసం దంపతులు రోడ్డుపై నిలబడి ఉన్నారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన నలుగురు యువకులు 'ఏయ్.. ఈమె రేటు ఎంత !?' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. భార్య గురించి తప్పుగా మాట్లాడటంతో భర్త ఆగ్రహానికి గురయ్యాడు. పూటుగా మద్యం సేవించిన యువకులు 'ఇవన్నీ చాలానే చూశాములే.' అంటూ గొడవకు దిగారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో బిడ్డను, భార్యను కాపాడుకునేందుకు గట్టిగా కేకలు వేశాడు. అంతే.. ఆ యువకులు బైక్‌లపై పరారయ్యారు.

నెల్లూరు జిల్లాతోపాటు, ప్రకాశం, తిరుపతి, కడప, కర్నూలు తదితర పొరుగు జిల్లాల నుంచి నెల్లూరు నగరంలో ఉన్న ప్రముఖ వైద్యశాలలకు ప్రతి రోజు వేలాది మంది ప్రజలు వస్తుంటూరు. రాత్రింబవళ్లు పొగతోట నుంచి బృందావనం వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అలాగే ఎప్పటినుంచో మంచి పేరున్న మూడు హాళ్ల ప్రస్తుతం ఎస్-2 థియేటర్లకు అర్ధరాత్రి 2 గంటల సమయంలోనూ సెకండ్ షో చూసుకొని ఎంతోమంది ఇళ్లకు వెళుతుంటారు. అలాంటి ప్రాంతాలైన పొగతోట, బృందావనంలో ఇటీవల వేశ్యలు, హిజ్రాల ఆగడాలు ఎక్కువయ్యాయి. రైల్వేకట్టకు ఇరువైపులా పదుల సంఖ్యలో నిల్చొని దారినపోయే వారిని చేతులు ఊపుతూ 'వస్తావా..' అంటూ పిలుస్తున్నారు. ఈ ప్రాంతం రెడ్‌లైట్ ఏరియాగా మారడంతో పదుల సంఖ్యలో మగవారు బైక్‌లు, ఆటోలు, కార్లలో వస్తూ గుంపులు గుంపులుగా నిలబడి బేరసారాలు చేస్తున్నారు.

**● పెడదోవపడుతున్న యువత**

విద్య, ఉపాధి కోసం ఎంతోమంది యువకులు నెల్లూరు నగరంలో ఉంటున్నారు. పొగతోట నుంచి బృందావనం వరకు రైలుకట్ట పక్కనే వేశ్యలు, హిజ్రాలు నిలబడి యువకులను ఆకర్షించేలా వయ్యారాలు ఒలకబోస్తూ సైగలు చేస్తుండటంతో ఆకర్షితులవుతున్నారు. వారి మోజులో పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

**● మహిళలకు తప్పని వేధింపులు**

పొగతోట, బృందావనం ప్రాంతాల్లో ఉన్న వైద్యశాలలకు రాత్రి సమయాల్లోనూ ప్రజలు వస్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో సామాన్య ప్రజలు రోడ్డుపై వారి మధ్య నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వెళుతున్న మహిళలను కూడా కొంతమంది విటులు అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. ఇది తెలిసిన చాలామంది ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆసుపత్రులకు వెళుతున్నారు. ఈ విషయం తెలియని వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అది నెల్లూరులోని నడిబొడ్డున ఉన్న ప్రాంతం. రాత్రి 8 గంటలు దాటితే చాలు.. కళ్లు జిగేల్‌మనిపించే చీరలు, పంజాబీ డ్రస్సులు ధరించిన మహిళలు, హిజ్రాలు రోడ్డుపై వాలిపోతారు. అటువైపు వెళ్లే మగవారిని తమ కవ్వింపు చర్యలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. "ఏం బావా వస్తావా!?.. నీక్కావలసింది.. నా దగ్గర ఉంది" అంటూ కొంటెగా.. మత్తుగా పెదాలు కొరుకుతూ సైగలు చేస్తూ ఆహ్వానిస్తారు. నగరంలోని నక్కలోళ్ల సెంటర్ దాటాక పొగతోట నుంచి బృందావనంలోని ఎస్-2 థియేటర్ దాటి మలుపు తిరిగే వరకు రైలు కట్ట వెంబడి రెడ్‌లైట్ ఏరియాను మించిన పరిస్థితులు అక్కడున్నాయి. కుటుంబసభ్యులతో రాత్రిపూట ఇటువైపు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది.

**● కత్తులతో బెదిరించి దోపిడీలు**

కొందరు హిజ్రాలు, పిక్‌ప్యాకెట్‌లకు పాల్పడే వారు బృందాలుగా ఏర్పడి ద్విచక్ర వాహనదారులు, పాదచారులను టార్గెట్ చేస్తున్నారు. కత్తులతో వారిని బెదిరించి నగదు, నగలు, సెల్‌ఫోన్లు ఇతర విలువైన వస్తువులను దోచుకెళుతున్నారు. ప్రధానంగా విటులుగా వచ్చేవారినే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. పనైపోయిన తర్వాత అక్కడ నుంచి వెళుతున్న వారిపైనా దోపిడీకి పాల్పడుతున్నారు. అయితే ఈ విషయం పోలీసులకు చెబితే తమ పరువు పోతుందన్న భయంతో ఫిర్యాదు కూడా చేయడం లేదు.

**● పోలీసుల తీరుపైనా విమర్శలే**

నగర నడిబొడ్డున ఇష్టానుసారంగా వ్యభిచారం జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా విజయమహల్ గేటును కొన్ని నెలలుగా పూర్తిగా మూసివేయడంతో గేటుకు ఇరువైపులా వేశ్యలు, హిజ్రాలు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. గేటు ఇవతల రామచంద్రారెడ్డి వైద్యశాల ప్రాంతం సంతపేట పోలీసుస్టేషన్ పరిధి, గేటు ఇవతల ఓ బార్ ఉన్న ప్రాంతం బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధి, ఎస్-2 థియేటర్ రోడ్డు చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో ఉంది. ఈ ప్రాంతం మూడు స్టేషన్ల పరిధిలో ఉండటంతో ఎవరికివారు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది పోలీసులు హిజ్రాలు, వేశ్యల వద్ద మాముళ్లు తీసుకుంటూ విటులనే టార్గెట్ చేస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడం, స్టేషన్‌కు వెళ్లేలోపే వారి నుంచి ఎంతోకొంత లాక్కొని వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి జనసంద్రమైన ఈ ప్రాంతంపై నిఘా ఉంచాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు (క్రైం)



జీవితంలో మధుర జ్ఞాపకం స్నేహం
రక్తబంధం కన్నా గొప్పది ఆ బంధం
నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం



# ఓ.. మై ఫ్రెండ్!

**మనతో ఉంటూ మన మంచిచెడులు ఆలోచించేవాడే ఫ్రెండ్. మన కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ సహాయ పడేవాడే నిజమైన మిత్రుడు. అలాంటి మిత్రుడిని మనం ఎప్పటికీ వదులుకోకూడదు. తిట్టుకున్నా.. కొట్టుకున్నా నిజమైన స్నేహితులు ఎప్పటికైనా మళ్లీ కలుస్తారు. అదే స్నేహబంధానికి ఉన్న గొప్ప పరమార్థం. ప్రస్తుత సమాజంలో స్నేహానికి ఉన్న ప్రాధాన్యం మరేదేనికీ లేదు. ప్రతి మనిషి జీవితంలో ఒక్కసారైనా వెనక్కు తిరిగి చూసుకుంటే సగం జీవితం స్నేహితులతోనే ఉంటుంది. అది స్కూల్, కాలేజ్, ఆఫీస్ ఇలా ఏదైనా కావచ్చు. ఆ మధుర జ్ఞాపకాలు తలచుకోవాల్సిందే. అందుకే స్నేహం శాశ్వతం. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.**

### దశాబ్దాలుగా చెదరని స్నేహం

మూడు దశాబ్దాలకుపైగా చెక్కుచెదరని స్నేహంతో అందరం కలిసి వివేకానంద వాకర్స్ సంఘాన్ని ఏర్పాటు చేశాం. కుల, మతాలకు అతీతంగా స్నేహమే పరమావధిగా ఎన్నో సంవత్సరాల నుంచి ఎలాంటి పొరపొచ్చలు, బేధాభిప్రాయాలు లేకుండా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నాము. వ్యక్తిగత సమస్యలు, సంతోషాల దగ్గర నుంచి కుటుంబ సంబరాల వరకు అన్నీ కలిసే చేసుకుంటున్నాము. వీటితోపాటు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ సమాజ సేవలో కూడా పాలు పంచుకుంటున్నాము. అలాగే మిత్రులందరూ కూడా భారతీయులుగా భావించి ఎలాంటి కుల, మతాలకు తావులేకుండా స్నేహాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము.

- వివేకానంద వాకర్స్ అసోసియేషన్, నెల్లూరు



కావలిలో సెవెన్ లయన్స్ మిత్రబృందం

### కావలిలో 'సెవెన్ లయన్స్'

కావలిలో సెవెన్ లయన్స్ అంటే గాదంశెట్టి వేణు, పొదర్తి నాగరాజు, సువర్ణ శ్రీను, వేల్పూరి రవి, పెట్టుగాని రమేష్, లెక్కల సురేష్, శివకుమార్‌ల మిత్రబృందమే గుర్తుకు వస్తుంది. ఏ పని చేయాల న్నా ఈ ఏడుగురు మిత్రబృందం కలవాల్సిందే. రోజులో ఒక్కసారైనా అందరూ కలవడం, ఒకరికష్టాలు ఒకరు పంచుకోవడం జరుగుతుంది. శుభకార్యాలకు సామాజిక రాజకీయ కార్యక్రమాలకు కలిసి వెళ్తూ స్నేహమంటే సెవెన్ లయన్స్‌లా ఉండాలని పట్టణ ప్రజలు ఇప్పటికీ అనుకుంటుంటారు.

### అర్ధశతాబ్దపు స్నేహం



ఈ ఇద్దరినీ చూస్తుంటే 1975లో విడుదలైన హిందీ సినిమా గుర్తుకు వస్తుంది. ఆ సినిమాలోని 'ఏ దోసితే.. హమ్ నహీ చోడెంగే.' పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ సినిమాలోని ఇద్దరు హీరోలు అమితాబ్ బచ్చన్, ధర్మేంద్ర మధ్య సాగిన సన్నివేశాలు మనకు గుర్తుకువస్తాయి. ఈ ఫొటోలోని ఈ ఇద్దరిని చూసినా ఆ సినిమానే గుర్తుకు వస్తుంది. సంగం మండలం కొరిమెర్ల గ్రామానికి చెందిన వెలిసేని యానాదయ్య, పొదలకూరు మండలం సూరాయపాళెం ఇమామ్ సాహెబ్‌లు 23 ఏళ్ల వయసులో స్నేహితులయ్యారు. ఇప్పుడు ఇద్దరి వయసు 75 ఏళ్లు. ఎవరికి ఏ కష్టం వచ్చినా పంచుకుంటారు. వీరిద్దరూ ఎక్కడ ఉన్నా ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడుకోవాల్సిందే. ఈ ఇద్దరే కాదు. ఫోన్ చేస్తే యానాదయ్య భార్య ప్రభావతి, కుమారులు, కుమార్తె, చివరకు మనువళ్లు, మనువరాళ్లు మాట్లాడతారు. యానాదయ్య కుటుంబ ఎప్పుడైన స్వగ్రామం వచ్చినప్పుడు సంగంలోని ఇమామ్ సాహెబ్ వద్దకు తప్పక వస్తారు. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. 1968లో ఏర్పడిన వీరి స్నేహం నేటి యువతకు ఆదర్శం.

- సంగం

స్నేహానికి పునాదులు ఎక్కువగా బాల్యదశలో పడతాయి. బాల్యంలో ఏర్పడిన స్నేహం ధృడంగా, మధురంగా ఉంటుంది. వారికి ఉన్న పరిచయాలను బట్టి కొందరికి స్నేహితులు తక్కువగా, మరికొందరికి ఎక్కువగా ఉండటం సహజం. పాత రోజుల్లో స్నేహాల పరిస్థితి వేరు.. ప్రస్తుత స్నేహాల పరిస్థితి వేరు. ప్రస్తుతం ఉన్న స్నేహితుల నడుమ కమ్యూనికేషన్ గ్యాప్ బాగా పెరిగిపోయింది. నాడు తరచూ కలుసుకునే స్నేహితులు నేడు ఇంటర్నెట్‌లో కలుసుకుంటున్నారు. ప్రస్తుతం 35 శాతం మంది మాత్రమే స్నేహితులను ప్రత్యక్షంగా కలుసుకుని మాట్లాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పాతతరం స్నేహితు లైతే ఉత్తరాల ద్వారా మరికొంత కాలానికి ల్యాండ్‌ఫోన్‌లతో పలకరింపులకు పరిమితమైన స్నేహితులు నేడు పెరిగిన ఆధునిక టెక్నాలజీ కారణంగా ఇంటర్‌నెట్ సౌకర్యంతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ప్రతి క్షణం స్నేహితులు పక్కనే ఉన్న రీతిలో మానసిక సంతృప్తి పొందుతున్నారు. ఎల్లలు దాటి ఏ ప్రాంతంలో స్నేహితులు ఉన్నా క్షణాల్లో పలకరించుకునే పరిస్థితులు కల్పించు కుంటున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, హైక్, వీచాట్, గూగుల్‌ప్లస్, టెలిగ్రాం, వైబర్, ఫేస్‌బుక్ వంటి పలు రకాల సోషల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించు కుంటున్నారు. ఒక్క పాత స్నేహితుడు కనిపిస్తే చాలు వెంటనే వారి మిత్ర బృందానికి సమాచారం చేరవేస్తున్నారు. అందరి వివరాలను సేకరించుకుని ఫోన్ నెంబర్లతో వివిధ పేర్లతో గ్రూపులను క్రియేట్ చేసుకుంటున్నారు. పండుగలు, ఇతర వేడుకలు, సంబరాలు కలిసి చేసుకోవడంతోపాటు సరికొత్త ఎమోజీస్‌తో సమాచారం ఇవ్వడం కొత్త ట్రెండ్‌గా మారింది.

**● సేవాభావం..**

ఒక పాఠశాలలో లేదా కళాశాలలో కలిసి చదువుకున్న మిత్రబృందం అంతా కలిసి వారు చదువుకున్న విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా వారి కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా సందడి చేసి చదువు చెప్పిన గురువులను సన్మానిస్తున్నారు. చదువుకున్న విద్యాలయానికి ఏదైనా మంచి చేయాలన్న తలంపుతో శాశ్వత ప్రాజెక్ట్‌లను నిర్మించేలా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. వారు చదువుకున్న కాలాన్ని గుర్తుంచుకునేలా విలువైన, ఉపయోగకరమైన వస్తువులను బహూకరించే సంప్రదాయం కొనసాగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో చిన్ననాటి స్నేహితులంతా కలిసి ఆర్థికపరమైన నిధిని ఏర్పాటు చేసుకుని ఒకొరికొకరు సహాయ పడడంతోపాటు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక మిత్రుడికి ఆపద వచ్చిందంటే చాలు మేమున్నాం అంటూ చేయీ చేయీ కలిపి బాసటగా నిలుస్తున్నారు. ఇలాంటి విలువైన స్నేహానికి హ్యాట్సాఫ్ చెబుతూ మిత్రులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.

- నెల్లూరు (విద్య)

**ఇలా పుట్టింది!**

స్నేహం అనే గొప్ప అనుభూతిని సంబరంగా మార్చుకోవాలన్న ఆలోచన నుంచి పుట్టిందే స్నేహితుల దినోత్సవం. మంచి స్నేహితులను గుర్తించుకునేందుకు, వాళ్లతో గడిపేందుకు ఏటా ఆగస్టు మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్‌షిప్ డేగా జరుపుకుంటారు. ఈ స్నేహితుల దినోత్సవానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. 1935 ఆగస్టు మొదటి శనివారంలో అమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన మిత్రుడిని మరిచిపోలేక మరో మిత్రుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈ ఘటన ప్రజలను, ప్రభుత్వాన్ని కలిచివేసింది. ప్రజల ఆమోదంతో వెంటనే ప్రభుత్వం ఆగస్టు మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్‌షిప్ డేగా ప్రకటించింది. అప్పటి నుంచి చిన్నా, పెద్దా, వయసుతో తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.



కోవూరులో చిరునవ్వులు చిందిస్తున్న స్నేహితురాళ్లు

### స్నేహం ఎంతో విలువైనది

దశాబ్ద కాలాల స్నేహాన్ని ఒక దగ్గర చేర్చి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పొరపచ్చలు లేకుండా అందరూ ఒకేమాటపై ఉంటూ అన్ని రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్టేడియంలో నిరంతరం స్నేహితుల నడుమ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి విజేతకు బహుమతి అందిస్తూ ఉత్సాహపరుస్తు న్నాము. మనిషి అవసరాలన్నింటిలో కూడా స్నేహిలంతా కలిసి చర్చించుకుని ఎవరికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ అందరం ఒకరికి ఒకరం అండగా ఉంటున్నాం.

- ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్, నెల్లూరు

### స్నేహమంటే భరోసా



కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల కన్నా స్నేహితులే భరోసాగా నిలబడ తారు. వేల కోట్ల ఆస్తులకన్నా స్నేహితుడు మిన్న అనే సందర్భాలు ఎన్నో ఉంటాయి. దాపరికం లేకుండా ఉండటం, స్నేహితుడు కష్టంలో ఉన్నప్పుడు అడక్కుండానే సాయం అందించావాడే స్నేహితుడు. నిజమైన స్నేహితులున్నవారు ఎటువంటి కష్టాన్నయినా ఎటువంటి ఇబ్బందికైనా భయపడరు.

- గాదంశెట్టి వేణుగోపాల్, కావలి

### ఈ బంధమే మా ఆరోగ్యం కాపాడుతోంది!



చిన్నప్పుడు చేసిన చిలిపి పనులే నిత్యం స్మరించుకుంటాం. ప్రతిరోజూ సాయంత్రం ఈ వేప చెట్టుకిందకు చేరిపోతాం. ఆ రోజు ఏమేమి చేశామో మాట్లాడుకుంటాం. కాసేపు వాదించుకుంటాం. అంతా కలిసి సరదాగా టీ తాగుతాం. ఆనందంగా ఇంటికి వెళ్తాం. స్నేహబంధమే మా ఆరోగ్యాన్ని కాపాడుతోంది.

- మారుబోయిన వరప్రసాద్,
రిటైర్డు ఉపాధ్యాయుడు, కోవూరు.

### వారి మధ్య గడపడమే హుషారు



ఎన్ని పనులున్నా ప్రతి రోజూ సాయంత్రం కోవూరు రైల్వేరోడ్డుకు వచ్చేస్తాం. అందరం కలుస్తాం. కష్టసుఖాలు పంచుకుంటాం. ఎంతో శక్తిని పొంది ఇంటికి వెళ్తాం. ఈ వయసులో ఇంతకన్నా ఆనందం ఎక్కడుంటుంది చెప్పండి. స్నేహితుల మధ్య గడపడమే హుషారునిస్తుంది.

- వెంకట వరప్రసాద్, కోవూరు

## తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు (హరనాథపురం): ఎన్నికల విధుల కోసం పొరుగు జిల్లాలకు బదిలీ అయి, తిరిగి జిల్లాకు చేరుకున్న 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

| పేరు | ప్రాంతం |
|---|---|
| జి. రాఘవేంద్రరావు | డీఏఓ (నెల్లూరు ఆర్డీఓ) |
| డి. లాజరస్ | నెల్లూరు రూరల్ |
| షేక్ షఫీమాలిక్ | నెల్లూరు అర్బన్ |
| ఏ వెంకటేశ్వర్లు | బుచ్చిరెడ్డిపాళెం |
| ఎం. పద్మజ | టీపీ గూడూరు |
| ఎస్.శ్రీనివాసులు | వెంకటాచలం |
| సిహెచ్ సుబ్బయ్య | మనుబోలు |
| ఎం. శ్రామ్‌సుందరరాజా | రాపూరు |
| ఎం. నిరంజన్ | డీఏఓ (ఆత్మకూరు ఆర్డీఓ) |
| వి. సుధీర్ | ఆత్మకూరు |
| ఏపీ రమణరావు | చేజర్ల |
| డి. శ్రీరామకృష్ణ | ఏఎస్‌పేట |
| బి. శోమ్లానాయక్ | సంగం |
| కె వీరవసంతరావు | అనంతసాగరం |
| ఎం.సుభద్ర | ఉదయగిరి |
| ఆర్.సూర్యనారాయణ సింగ్ | డీఏఓ (కావలి ఆర్డీఓ) |
| పి. హేమంత్‌కుమార్ | జలదంకి |
| వై. నాగరాజు | దుత్తలూరు |
| కె. స్ఫూర్తి | కొడవలూరు |
| కె. చంద్రశేఖర్ | విడవలూరు |
| ఎస్‌ఎం హమీద్ | వింజమూరు |
| టీ. శ్రీనివాసులు | డీఏఓ (కందుకూరు ఆర్డీఓ) |
| సయ్యద్ ఇక్బాల్ | కందుకూరు |
| ఈ. రమాదేవి | లింగసముద్రం |
| వి. లావణ్య | ఉలవపాడు |
| ఎస్‌కే. అబ్దుల్ హమీద్ | వలేటివారి పాళెం |
| కేవీటీటీ సుందరమ్మ | కొండాపురం |
| ఎస్‌ఎండీ హుస్సేన్ | వరికుంటపాడు |
| టి. విజయకుమార్ | ఏవో కలెక్టరేట్ |
| పి. శాంతకుమారి | కలెక్టరేట్ |
| ఎస్. శ్రీనివాసులరెడి | కలెక్టరేట్ (ల్యాండ్ మ్యాటర్స్) |
| ఎంవీకే సుధాకర్‌రావు | కలెక్టరేట్ జి సెక్షన్ |
| పి. విజయకుమార్ | కలెక్టరేట్ లీగల్ సెల్ |
| పి. శ్యామలమ్మ | కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ |
| ఎస్.. రమాదేవి | స్పెషల్ తహసీల్దార్ (ఎల్‌ఏ), నెల్లూరు |
| టి. శ్రీనివాసులు | స్పెషల్ తహసీల్దారు (ఎల్‌ఆర్), నెల్లూరు |
| కె. రాజ్యలక్ష్మి | స్పెషల్ తహసీల్దారు కేపీటీపీఎస్, నెల్లూరు |
| జి. రవీంద్రబాబు | ఏపీఓ, ఐటీడీఏ, నెల్లూరు |
| ఐ.ఎస్ ప్రసాద్ | తహసీల్దారు, తిరుపతి |
| ని, అనురాధ | తహసీల్దారు, తిరుపతి |
| పి. లక్ష్మీనరసింహం | తహసీల్దారు, తిరుపతి |


### డిప్యూటీ తహసీల్దార్లకు..

జిల్లాలో 12 మంది సీనియర్ డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్లకు పోస్టింగ్ ఇవ్వటం పట్ల ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి హర్షం ప్రకటించారు.

| పేరు | ప్రాంతం |
|---|---|
| పి. శైలకుమారి | తిరుపతి |
| టీవీఎం కృష్ణప్రసాద్ | ఇందుకూరుపేట |
| ఏ. లక్ష్మీనారాయణ | అల్లూరు |
| పి. శ్రావణ్‌కుమార్ | కావలి |
| కె. శిరీష | తిరుపతి |
| జి. స్వర్ణ | గుడ్లూరు |
| జె. స్వప్న | మర్రిపాడు |
| ఎం. సారంగపాణి | పొదలకూరు |
| ఎం. సురేష్‌బాబు | బోగోలు |
| సీహెచ్ హరికృష్ణ | తిరుపతి |
| ఎం. కోటేశ్వరరావు | దగదర్తి |
| ఎం. శ్రీనివాసులు | తిరుపతి |

# భక్తిశ్రద్ధలతో అబ్దుల్ ఖాదర్ గంధోత్సవం

- దర్గాలో ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక పార్థనలు
- దర్గా అభివృద్ధి పనులకు రూ.6లక్షల విరాళం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల, దగుమాటి



విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబైన ఉదయగిరి దర్గా

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 3:** హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవాన్ని భక్తులు శనివారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం దర్గా కమిటీ సభ్యులు చదివింపుల కార్యక్రమం చేపట్టారు. హక్కుదారుల ఇంటి నుంచి విద్యుత్ దీపాలంకరణ, మేళతాళాలు, ఫకీరు జరుబుల నడుమ గంధాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గంధంను దర్గాకు చేర్చి చదివింపులు చేసి భక్తులకు పెంచిపెట్టారు. భక్తులకు పెద్ద మసీదు ఆవరణలో అన్నదానం చేపట్టారు. హిందూ, ముస్లిం భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు**

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి శాసనసభ్యులు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో తాము చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తామని, దర్గా అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

**● రూ.6లక్షల విరాళం**

దర్గా ఆవరణలో భక్తుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దర్గా కమిటీ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. స్పందించిన పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.5లక్షలను దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, నాయకులు కాకర్ల వెంకట్, సందానీ, జాఫర్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు

**సంగం, ఆగస్టు 3:** వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన బోగిరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 19వ తేదీన చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లాడు. పనిచేసే కంపెనీకి వెళ్లలేదు. ఎక్కడ వెతికినా కపినించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కాశీరావు పుట్టినరోజు వేడుకలు

**సీతారామపురం, ఆగస్టు 3:** జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు పుట్టినరోజు వేడుకలను శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భోగినేని కాశీ రత్తయ్య (గాంధి), విఠల రమేష్, గోసుల మల్లిఖార్జున, నవదీప్, మనోజ్ పాల్గొన్నారు.



## బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు పట్టించాలి



సీతారామపురం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 3:** తల్లిపాలను బిడ్డకు ఆరు నెలలు తాపిస్తే సంపూర్ణ పోషక విలువలు అందుతాయని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై బాలింతలు, గర్భవతులు అవగాహన కల్పించారు. తల్లిపాలతో పిల్లలకు వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వరికుంటపాడు:** గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి పాల్గొని మాట్లాడారు. అపోహలు లేకుండా పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. గర్భవతి సమయం నుంచే మెరుగైన పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, కాయగూరలను అధికంగా తీసుకోవాలన్నారు. కేంద్రాల నుంచి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమాదేవి, రత్నమ్మ, అనూష, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

**సీతారామపురం:** స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వైద్యురాలు స్వప్న ఆశావర్కర్స్ అంగన్‌వాడీ సిబ్బందికి తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారి పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేప ట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఎంపీఎస్ క్రిష్ణమ్మ, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



గండిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య

### 'పది'లో ప్రతిభావంతులకు నగదు అందజేత



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**సంగం, ఆగస్టు 3:** పది పరీక్షల్లో 500మార్కులు పైన సాధించిన మర్రిపాడు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మేకల హనుమంతరావు శనివారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.7500, రూ.5వేలు, 500 మార్కులపైన వచ్చిన మిగిలిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500ల చొప్పున ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దాత మేకల హనుమంతరావును శాలువాతో సత్కరించారు.

### ఆత్మకూరులో దంత వైద్యశిబిరం

**ఆత్మకూరు, ఆగస్టు 3:** పట్టణంలోని అవినాష్ దంత వైద్యశాలలో శనివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం దంత వైద్యనిపుణులు అవినాష్ 98 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

### 'దాడి చేసి ఇళ్లను కూల్చడం దారుణం'

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 3:** నందిపాడు సెంటర్‌కు చెందిన మండ్ల వెంకటేశ్వర్ల కుటుంబసభ్యులపై దాడి చేసి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇళ్లు, రేకుల షెడ్లను, చెట్లను కూల్చివేయడం దారుణమని జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మండిపడ్డారు. శనివారం వారు కూల్చివేతలను పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాలకొండారెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

### నామినేటెడ్ పదవుల కోసం ఆరాటం

**వరికుంటపాడు, ఆగస్టు 3:** కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులపై తెలుగుదేశం నాయకుల్లో ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఇటీవల పార్టీ మండల కన్వీనర్ పదవి కోసం సోషల్ మీడియాలో చెలరేగిన అంశం మరువక ముందే శనివారం మరో అంశం తెరపైకి వచ్చింది. మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి నామినేటెడ్ పదవుల్లో భాగంగా తన పేరును పరిశీలించాలని కోరినట్లు సమాచారం. ఆయన ఉదయగిరి ఏఎంసీ చైర్మన్‌గా అవకాశ మివ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిసింది.

### దళితవాడ పాఠశాలలో శుభ్‌దిన్ భోజన్

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 3:** శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దళితవాడ పాఠశాలలో దాత ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పండ్లు, మిఠాయిలను భోజన సమయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులుతో పాటు ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల మృతికి సంతాపం

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 3:** వెంకట్రావుపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గెట్టిబోయిన శ్రీనివాసులు, ఉదయగిరి పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సింగనపల్లి జానీల మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట ఓబులరెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, నారాయణరెడ్డి ఉన్నారు.

### మొక్కల సంరక్షణ బాధ్యత విద్యార్థులదే !

**వింజమూరు, ఆగస్టు 3:** చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాలచెన్నయ్య మాట్లాడారు. మొక్కల సంరక్షణ బాధ్యత వారిదే అన్నారు.

### పింఛన్ల పంపిణీ

**వింజమూరు, ఆగస్టు 3:** నందిగుంటలో శనివారం టీడీపీ నాయకులు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గంగపట్ల వెంగయ్య, గ్రామ అధ్యక్షుడు చిలకల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బసిరెడ్డి జయంత్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వారి వెంట చిలకల బాబు, మైనార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బోదాల లక్ష్మణ్ ఉన్నారు.

### ఆలయ భూముల్లో అక్రమంగా మైనింగ్

**ఉలవపాడు, ఆగస్టు 3 :** స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయ భూముల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌కు సంబంధించిన వాహనాలను గ్రామస్థులు అడ్డగించారు. వాటిని పోలీసులకు అప్పగించి మూడు రోజులు అవుతున్నా ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. కేసు నమోదు చేయాలని అధికారులు ఇప్పటికి రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఆలయ పూజారి హేమంత్ శుక్రవారం నెల్లూరులో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అక్రమ మైనింగ్‌కి పాల్పడిన వ్యక్తిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పని చేయని అధికారులపై
## చర్యలు తప్పవు : కాకర్ల సురేష్



కలిగిరి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

**కలిగిరి, ఆగస్టు 3:** ప్రజలకు జవాబుదారీగా పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై అధికారులు అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డిపాలెం వీఆర్వో నరేష్‌పై పలువురు అవినీతి ఆరోపణలు చేయడంతోపాటు సాక్ష్యాలతోసహా నిరూపిస్తామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించగా, విచారణ జరిపి మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. ఉపాధి హామీ పనుల విషయంలో ఏపీవో శ్రీనివాసులు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ ఎంపీపీతో సహా తమను లెక్కచేయడంలేదంటూ సభ్యులు మండిపడ్డారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఫలితాలను రైతులకు చేరవేయకపోవడంపై వ్యవసాయాధికారులు జవాబుదారీగా పనిచేయాలన్నారు. ఎంపీపీ శిరీష మాట్లాడుతూ మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతోపాటు, ఎంపీడీవో నూతన భవనానికి నిధులు మంజూరుచేయాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**● ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించండి**

**కొండాపురం, ఆగస్టు3:** ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో పి.సుజాత మండల అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల కాలంలో ఆరోగ్య, విద్య, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం- గ్రామపంచాయతీలు, పశుసంవర్ధక, హౌసింగ్ తదితర శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గుడవళ్లూరులో మంచినీటి సరఫరా పథకం ద్వారా అన్ని కాలనీలకు నీరు అందించలేక పోతున్నామని, ఇందుకు కారణం నీటి వనరులు లేకపోవడమేనని సర్పంచి మాచెర్ల తెలిపారు. ఈసమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, వైద్యాధికారి భవ్య, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలి : ఎమ్మెల్యే కావ్య



డాక్టర్లను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, ఆగస్టు3:** అనుభవం కలిగిన నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది ఏరియా వైద్యశాలలో ఉన్నారని, పేదలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యేఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఏరియా వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి, వార్డుల్లో ఉన్న రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులు, అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సుమారు 900 మంది రోగులు వైద్యశాలకు వస్తున్నారని, వారికి వైద్యశాలపై నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. వైద్యశాలలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్న డాక్టర్లపై ఎవరూ దుష్ప్రచారం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రసూన, అభివృద్ధి కమిటీ సభ్యులు చవల రామకృష్ణ, డాక్టర్ బెజవాడ రవికుమార్, పొబ్బా సాయి విఠల్, ఏటూరి వివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**● వంద అడుగుల జాతీయ జెండాతో ప్రత్యేక గుర్తింపు**

కావలి పట్టణంలోని అన్న క్యాంటీన్‌కు ఎదురుగా నిర్మిస్తున్న 100 అడుగుల జాతీయ జెండా, ఏర్పాటు చేయనున్న మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానున్నదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. జాతీయజెండా పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టణానికి ఓ ఐకానిక్‌గా ఉండేలా ఎమ్మెల్యే సొంత నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఈనెల 15లోగా పనులు పూర్తికావలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య పాల్గొన్నారు.

## జగన్ పాలనలో విద్యార్థులకు అన్యాయం : ఇంటూరి



విద్యార్థికి పుస్తకాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు, ఆగస్టు 3:** జగన్ పాలనలో పేద విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారికి అన్యాయం చేశారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నోటు, పాఠ్యపుస్తకాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తాను నగదు బహుమతులను అందజేస్తానని ప్రకటించారు. కళాశాల మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు 15 ఫ్యాన్లు, ఉపాధ్యక్షుడు వడ్డెళ్ల రవిచంద్ర ఐదు ఫ్యాన్లు, ఓగూరు గ్రామ టీడీపీ నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు కంప్యూటర్‌ను కళాశాలకు బహూకరిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల అవసరాల గురించి ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన :** కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. టౌన్ క్లబ్ నుంచి ఆది ఆంధ్ర కాలనీ వరకు తారురోడ్డు నిర్మాణం, అదే రోడ్డులో వాగుపై వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యు. శ్రీనివాసరావు, డీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## ఊరూరా తల్లిపాల వారోత్సవాల నిర్వహణ



వలేటివారిపాలెం : తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత

**లింగసముద్రం, ఆగస్టు 3 :** తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని సెక్టార్ సూపర్‌వైజర్ ఎం రాధాదేవి చెప్పారు.శనివారం లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ సీహెచ్ కోటమ్మ, ఆయా పూరిమిట్ల కుమారి తల్లులు పాల్గొన్నారు.

**కలిగిరి :** మండలంలోని చినఅన్నలూరు పంచాయతీ తూర్పుదళితపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్ ఉమామహేశ్వరి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, ఏఎన్ఎంలు బీ సుజాత, జీ సౌజన్య, బీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

**కొండాపురం :** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని గుడవళ్లూరు అంగన్‌వాడీ కార్యకర్త జీ అంకమ్మ తెలిపారు. మండలకేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తల్లులు, గర్భిణీలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం :** పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో శనివారం తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి అనుమోల అమరేశ్వరి, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, క్రిష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ ఉత్సవాల ప్రారంభం

**బిట్రగుంట, ఆగస్టు 3:** బోగోలు మండలం కొండబిట్రగుంటలో శనివారం కనకదుర్గమ్మ ఉత్సవాలు గ్రామ పెదకాపు కాకు మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో వేపకొమ్మ కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శిల్పి కనకదుర్గమ్మ ప్రతిమను చెక్కి జలాధివాసం చేశారు. రాత్రి పడమర పోలిమేర్లలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో కనకదుర్మమ్మకు కుంభాభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### 'ఎస్సీల వర్గీకరణ సమంజసం కాదు'

**అల్లూరు, ఆగస్టు 3 :** రాజకీయ లబ్ధి కోసం ఎస్సీల వర్గీకరణ సమంజసం కాదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐకమత్యంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కులాల్లో విభేదాలు సృష్టించడం కోసం ఈ వర్గీకరణను తీసుకువచ్చారన్నారు. ఈ వర్గీకరణ కేవలం రాజకీయ లబ్ధికి తప్ప ఇతరత్రా ఉపయోగాలు ఏమీ లేవన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ మాదిరిగానే వర్గీకరణలో సమన్యాయం, సామాజిక న్యాయం ఉండాలన్నారు.

### ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

**కొండాపురం :** పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై అవగాహన ఎంతో అవసరమని ఎంఈవో-1 కే.రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల విద్యా వనరులకేంద్రంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించి, అధ్యక్ష, సభ్యుల వివరాలను అదేరోజు మండల విద్యావనరుల కేంద్ర కార్యాలయంలో అందచేయాలన్నారు.

### వాటరు ట్యాంకుల క్లోరినేషన్

**వలేటివారిపాలెం :** మండలంలోని జమీన్‌ఉప్పలపాడు, పోలినేనిపాలెంలలో వాటర్‌ట్యాంక్‌లను శనివారం సర్పంచులు వీ. వెంకటేశ్వర్లు, ఏ. అమరేశ్వరి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందితో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

### జనసేన సభ్యత్వ నమోదు

**కావలి :** పట్టణంలోని ఏరియా వైద్యశాల వద్ద శనివారం జనసేన సభ్యత్వ నమోదు జరిగింది. కందుల లక్ష్మీ, కవిత తదితర మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వీరమహిళా కోఆర్డినేటర్ వెంకటరత్నం యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గురుకుల కిషోర్, సీనియర్ నాయకులు మల్లికార్జునయాదవ్, జమీర్ ముఖ్య అతిథి లుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు ఇందిర, శశికళ, హసీనా, నాయకులు ఎస్. వెంకటసుబ్బయ్య, ఆలా శ్రీనాథ్, తోకల వెంకటేశ్వర్లు,పీ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

### యంత్ర పరికరాలు హైరింగ్ సెంటర్లలో ఉంచాలి

**కందుకూరు :** ప్రభుత్వం సబ్సిడీతో అందజేసిన వ్యవసాయ యంత్ర పరికరాలన్నీ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో ఉంచాలని మండల వ్యవసాయాధికారి వీ రాము తెలిపారు. శనివారం మండలంలోని పాలూరు రైతు సేవాకేంద్రంలోని కమ్యూనిటీ హైరింగ్‌సెంటర్ పరిధిలో అందజేసిన యంత్ర పరికరాలను ఆయన పరిశీలించారు. పరికరాలను ఇతరులకు అమ్మకాలు జరిపితే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

### అవినాష్‌బాబుకు డాక్టరేట్



**కావలి రూరల్ :** మండలం పూలదొరువు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి అవినాష్‌బాబు డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడులోని వేలూరు విట్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన 39వ స్నాతకోత్సవంలో అవినీష్‌బాబు డాక్టరేట్ అందుకోవటం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు సుధాకర్, రోహిణి శనివారం ఓ ప్రకటనలలో పేర్కొన్నారు. విట్ ప్రొఫెసర్ మాధురి నేతృత్వంలో మెటీరియల్ సైన్స్‌లో 'ఎనర్జీ కన్వర్షన్ అండ్ ఎనర్జీ స్టోరేజ్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడంతో పలువురు అభినందించారు.

### బీజేపీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి : వంశీ

**కందుకూరు :** బూత్ కమిటీలను బలోపేతం చేయటం ద్వారా బీజేపీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధరరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సముచిత న్యాయం జరిగేలా కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యరబోలు రాజేష్, పీవీ కృష్ణారెడ్డి, జొన్నాదుల రాఘవయ్య, సురేష్, మన్నేపల్లి వరప్రసాదరావు, సుధాకర్, డేవిడ్ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

### మాలకొండ ఆదాయం రూ. 6,94,971

**వలేటివారిపాలెం :** మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,94,971 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు

### ఉచిత దంత వైద్యశిబిరం

**కావలిటౌన్ :** స్థానిక బాలకృష్ణారెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. పవిత్ర డెంటల్ ఆసుపత్రి వైద్యురాలు పవిత్ర విద్యార్థులకు, స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.